# శ్రీ గురు చరితామృతం

## నిత్య మనన గ్రంధం



సర్వ స్వామ్యములు - సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ వారివి.
2025 సం|| - 500 కాపీలు

శ్రీ గురు చరితామృతం
నిత్య మనన గ్రంధం

రచన - గురుదేవుని గరికపూవు
shreeguruvarapublications@gmail.com
Phone : 9884415589

కాపీల కొరకు:
శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్
గొలగమూడి (PO)
నెల్లూరు జిల్లా - 524321

## విషయ సూచిక

| | |
|---|---|
| పరిచయము | 3 |
| గురుస్తుతి | 3 |
| ప్రేరణ | 6 |
| అధ్యాయం- 1 | 8 |
| అధ్యాయం -2 | 16 |
| అధ్యాయం -3 | 25 |
| అధ్యాయం - 4 | 31 |
| అధ్యాయం - 5 | 38 |
| అధ్యాయం - 6 | 41 |
| అధ్యాయం - 7 | 50 |
| అవధూతోపాఖ్యానం | 63 |
| -శ్రీ గురుభ్యోనమః- | 68 |

# పరిచయము

నాయనలారా!

మీకు సర్వ శుభాలు కలగుగాక!

“నలుగురు ఒక్కచోట చేరి మా చరిత్రను పారాయణం చేసేవారు, అందులోని స్తోత్రాలను పఠించేవారు, నామసంకీర్తన చేసేవారు — వారు మా ప్రీతికి పాత్రులు. మా కథామృత గానం చేసేవారి ఇంట పురుషార్థ చతుష్టయం, సిద్ధులు నిత్యవాసం చేస్తారు. జీవితాంతం అపార ఐశ్వర్యాలు, అనంతరం ముక్తి సిద్ధిస్తాయి,” అని శ్రీ నృసింహ సరస్వతి స్వాములు తమ శిష్యులను ఆశీర్వదిస్తూ చెప్పారు. ఈ పుణ్యవాక్యాలు మనందరికీ శిరోధార్యం.

గురుభక్తులలో ఒకరు శ్రీ గురుచరిత్రను గేయరూపంలో రచించగా, ఆ గేయాన్ని ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ పర్యవేక్షించారు. అంతేకాక, ఆ గేయాన్ని పారాయణ చేసిన వారికి తమ సాన్నిధ్యాన్ని, ఆశీస్సులను ప్రసాదించారు.

ఆ పవిత్ర స్ఫూర్తితో గురుభక్తులైన గురుదేవుని గరికపూవు, నిరంతరం శ్రీ గురుని లీలలను మననం చేసే పరంపరలో, శ్రీ గురు చరిత్ర గేయంలో ప్రస్తావించ బడని లీలలతో సహా శ్రీ భరద్వాజ మాష్టారుగారు అందించిన గురుచరిత్రను సులభంగా మరల-మరల మననం చేసుకోనుటకు సౌలభ్యము కొరకు, చిన్న పిల్లలకు సైతము చిన్న-చిన్న కథలుగా చదువుకొనే విధంగా గద్యరూపంలో కూర్చుకొన్నారు.

చిరంజీవులు లక్ష్మీప్రియ, హిమహాసినులు — లీలలను దృశ్యరూపంలో చిత్రీకరించడం ఈ కూర్పుకు మరింత అందాన్ని జోడించింది.

వారి భక్తి, శ్రద్ధ, కృషి చూసి మనసు హర్షించగా, ఈ కూర్పును గ్రంథరూపంలో ముద్రిస్తే చదివే వారికి అక్షర రూపంలోనూ, దృశ్య రూపంలోనూ శ్రీ గురుదేవుడు హృదయాల్లో ప్రవేశించి, చిత్తశుద్ధిని ప్రసాదించి, నిరంతర మననం, సమస్త మంగళాలు ప్రసాదిస్తారని ఆశిస్తున్నాము

**శ్రీసాయి మాస్టర్ సేవా ట్రస్ట్**

# గురుస్తుతి

## ఓం శ్రీ గురవే నమః

శ్రీ గురుచరితం యొక్క మధురిమను 12 ఏళ్ళకు మునుపు చవిచూసాను. మా చిన్న పాపకు 5 నెలలు ఉంటాయి. అప్పుడు మొదటి సారి

శ్రీ భరద్వాజ మాస్టర్ గారు వ్రాసిన శ్రీ గురుచరితమును నా భర్త తీసుకొచ్చారు. ఆయన చదివి నన్నుకూడా చదవమన్నారు. 'అమ్మో! ఎన్నో నియమ నిబంధనలతో కూడిన గురుచరిత్ర పారాయణ ఎంతో కష్టం' అని నాకు అనిపించింది. పుస్తకం అట్ట పై ఉన్న శ్రీ గురు మూర్తికి ఆకర్షితనై పుటలు అలా తిరగేస్తూ ఒక చోట చదివాను-శ్రీ గురు చరితం శ్రద్ధగా సప్తాహ పారాయణ చేస్తే స్వయంగా దత్త మూర్తి వచ్చి మన గురువుని మనకు చూపుతాడు అని. అంతే, మనస్సు ఎంతో ఉత్సాహంతో ఉరకలు వేసింది, పారాయణ చేయాలని. ఓ గురువారం నాడు పారాయణ ప్రారంభించాను. అది జూన్ మాసం-మామిడిపళ్ళు కాలం కావటంతో పారాయణకు మామిడి పళ్ళను గురువుకి వదిలి శ్రద్ధగా ఏడు రోజులలో శ్రీ గురుచరితమును చదివాను. ఎంతో ఉద్వేగంతో పడుకున్నాను-దత్తుడు,నా గురువుని కలలో చూపుతారని. కానీ ఏ కలా రాలేదు, ఎవ్వరూ కనపడలేదు. ఎంతో బాధనిపించింది. క్రమంగా ఉక్రోషం ఆవరించింది. గురు చరిత్ర పుస్తకం తీసుకుని, భరద్వాజ మాస్టర్ గారి బొమ్మతో "ఏమయ్యా నువ్వే కదా వ్రాసావు భక్తితో పారాయణ చేస్తే గురువు కనపడతారని, అన్నీ అబద్ధాలేనా? నీ మాట నమ్మి ఎంత కష్టపడి పారాయణ చేశానో నీకు తెలుసా? ఇంటి పనులు, వంట పనులు, చిన్న పాప పనులు, 2వతరగతి చదువుతున్న పెద్దపాప పనులు అన్నీ సకాలంలో పూర్తిచేసుకుని (నాకున్న శుభ్రత తీవ్రత వలన పని మనుషులను పెట్టుకోలేను, వారిని ఇలా చెయ్ -అలా చెయ్ అని అదిలించనూ లేను. అన్నీ కష్టపడి నేనే చేసుకుంటాను.) రాత్రి అందరూ పడుకున్నాక కూర్చొని చదివాను. ఇంత చేసినా అంతా వ్యర్థమే అయింది. చాలా బాగా చెప్పావు లే."అని ఆయన మీద కష్టం అంతా ఒలకపోసేసాను. ఆ రోజు....కల కాదు- మెలుకువా కాదు, నిద్ర కాదు-మత్తు కాదు. ఓ గమ్మత్తైన జాగృత అవస్థలో ఈ దృశ్యం కళ్ళ ముందు కదలాడింది. తిరుపతి దైవ దర్శనం కోసం వరుసలో నిలుచున్నాను. చాలా మంది జనం ఉన్నారు. అందరిని తోసుకుని ముందుకు పోదామా అని చూస్తున్నాను. అపుడు తెల్ల బట్టలు ధరించి భరద్వాజ మాస్టర్ గారు నా దగ్గరకు వచ్చి " అడ్డంగా వెళ్ళాలని చూస్తావేం? నాతో రా, నిన్ను సరైన త్రోవలో తీసుకెళ్తాను." అని వెనుతిరిగి చాలా వేగంగా నడుస్తూ వెళ్తున్నారు. ఆయన వెనుక అంత వేగంగా నడవలేక పరుగిడుతూ ఉన్నాను. ఒక చోట పెద్ద ఇనుప గేటు, సుమారు 25 అడుగుల పొడవైన తలుపులతో ఆకు పచ్చ

రంగులో, చాలా గట్టిగా, బలంగా ఉంది. ఆ గేటు తెరుచుకుని లోపలకు వెళ్ళారు, ఆయనతో వెళ్ళాను. ఒక పెద్ద గది, ఆ గదిలో చుట్టూ ఋషి పుంగవులు కూర్చుని ఉన్నారు, మధ్యలో శిరిడీ సాయి బాబా కూర్చుని ఉన్నారు. ఆయన ముందు మేము నిలబడి ఉన్నాం. బాబా నా వైపు కొంచెం కోపంగా చూస్తూ, "ఈ అమ్మాయిని ఇక్కడకెందుకు తీసుకొచ్చావు నువ్వు?" అని భరద్వాజ మాస్టర్ గారిని అడుగుతున్నారు. మాస్టర్ గారు చేతులు కట్టుకుని, ఒక చేయి నోటికి అడ్డంగా పెట్టుకుని కొంచెం నవ్వుతున్నారు. అప్పుడు నేను ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నాను. ఈ లోగా ఎవరో చారు-అన్నం ఉన్న పళ్ళెంను బాబా చేతికిచ్చారు. బాబా చారన్నం బాగా కలిపి ఒక పెద్ద ముద్ద చేసి, "ఇక చాల్లె, ఇలా రా!" అని దగ్గరకు పిలిచి నోట్లో పెట్టారు. అంత పెద్ద ముద్ద నా నోట్లో సరిపడక కొంచెం బాబా చేతిలో మిగిలిపోయింది. అది బాబా తినేసారు. మనోహర దృశ్యం ముగిసింది.

అక్కడ పరిస్థితి ఎలా ఉందంటే అమ్మను వదిలి పిల్ల ఎక్కడో తిరుగుతూ ఉంటే పట్టుకుని మన వాళ్ళు ఆ పిల్లను అమ్మ దగ్గర నిలబెడితే అమ్మ కొంచెం కోపంగా ఎందుకలా చేసావ్? అని అడిగి, పిల్ల చెప్తున్నది కూడా వినకుండా, ఆకలి తీర్చాలని, గొప్ప పని చేసావులే, నోరు పట్టు అని అన్నం కలిపి పెట్టే అమ్మలా అనిపించింది.

అయితే బాబా ఎందుకు కోపం వహించారు అన్నది విన్నవిస్తాను. నాకు 16-19 సం||ల వయస్సు ఉన్నపుడు శిరిడీ సాయి బాబా గురించి మొదటి సారి తెలిసింది. అప్పటి నుంచి ఆయనను పూజిస్తూ ఉన్నాను. ఆనాటి నుంచి తన చల్లని ఆవరణలో నన్ను ఎలా పరిరక్షిస్తున్నారు అనేది చెప్పాలి అంటే – ఎన్ని పుస్తకాలైనా సరిపోవు. అవన్నీఆయన దయతో మళ్ళీ ఇంకో సారి చెప్పుకుందాం. అలాంటపుడు "నా దయామయ నీడలో నిన్ను నడిపిస్తూ, ఏ లోటూ లేకుండా నీ వెంట ఉండి కాపాడుతూ ఉంటే తెలుసుకోలేక, ఇంకా గురువు కావాలని గురు చరిత్ర పారాయణ చేశావా" అని అడుగుతున్నట్లు అనిపించింది. ఆ కలలో నా వయస్సు కూడా అలాగే ఉంది, 16-19సం||ల మధ్యలో ఉండే అమ్మాయిలా. అంతే కాదు ఇప్పటికీ ఆధ్యాత్మిక పరమయిన కలలన్నింటిలో నేను 16-19సం||ల వయస్సు అమ్మాయినే. ఇంత సత్యమైన గురుచరితం అందరూ నిత్యం మననం చేయాలనే తాపత్రయమే ఈ రచన.

# ప్రేరణ

12 ఏళ్ళకు ముందు రుచి చూసిన ఈ గురుచరితామృత మాధుర్యమును నేను ఇప్పటికీ ఆస్వాదిస్తూనే ఉన్నాను. ఎన్నో బాధలకు దివ్య ఔషధంగా ఈ పారాయణ చేస్తూ ఉంటాను. అలాగే క్రితం సం|| ఒక కోరిక నెరవేర్చమని గురుదేవుడికి చెప్పుకుని 3 పారాయణాలు చేస్తానని ఒప్పుకున్నాను. 2 పారాయణలు చేశాను. కోరిక తీరలేదు. మూడవ పారాయణ చేస్తూ ఆవేదనతో, " ఈ గురు చరిత్ర చదవటం ఇదే చివరి సారి. ఇంక ఈ పుస్తకం నేను ముట్టుకోను. మ్రొక్కుకున్నాను కాబట్టి మూడు పారాయణలు చేస్తాను. నువ్వు మాట తప్పినా నేను తప్పలేను",అని బీరాలు, బింకాలు అన్నీ గురువరుడితో చెప్పుకుని 3వ సారి పారాయణ పూర్తి చేసేసాను. అంతే. అప్పటినుంచి నా బుర్రలో గురు చరిత్రలో ఉన్న సన్నివేశాలు, లీలలు, కథలు, పేర్లుతో సహా గిర్రున తిరుగుతూ నిత్యం అలా మననం అవుతూ ఉన్నాయి. ఇంక వేరే ఏ పనిలోనూ శ్రద్ధ లేదు, ఆలోచన రాదు. గురు చరిత్ర పుస్తకం తెరిచి చూస్తే అంతా అలాగే ఉంది. అప్పుడే ఎవరో ఒక లీల పంపారు. అది శ్రీ మన్నవ సత్యం గారు ఒక సారి శ్రీ గురుచరితం 108 సార్లు పారాయణ చేస్తే భరద్వాజ మాస్టర్ గారు ఎంతో సంతోషించి ఆయనను తన ప్రక్కన కూర్చోపెట్టు కొన్నారు అని. అప్పటికి దత్త జయంతి 9 రోజుల తరువాత రానుంది. వెంటనే నాకనిపించింది. ఈ దత్త జయంతి కి 108 సార్లు గురు చరితామృతం పూర్తి చేయాలని. వేకువ ఝామున మొదలు పెట్టాను. రోజుకు 12 సార్లు చొప్పున 9 రోజులు x 12 సార్లు అలా మననం చేస్తూ 8 రోజులు పూర్తి అయ్యాయి. రేపు దత్త జయంతి అనగా రాత్రి భుజించేటపుడు నా పిల్లలతో కలిసి మాటాడుతూ ఉంటే వారు అడిగారు "అమ్మా దత్తాత్రేయుడు 3 తలలతో ఉంటారు. అతను ఉండే చోటు ఒక సారి ఔదంబర వృక్షం, ఇంకో సారి అశ్వత్థ వృక్షం, మరో సారి వట వృక్షం అంటారు అదెలా?" అని. అప్పుడు బాబా ను ప్రార్థించి, నాకు తోచినది ఇలా చెప్పాను.....

బ్రహ్మవిష్ణుమహేశ్వరస్వరూపమే దత్తాత్రేయుడు కదా, ముందుగా ఔదుంబర మూలంన ఉన్న బ్రహ్మ దేవుని నుంచి బ్రహ్మజ్ఞానం పొంది అశ్వత్థ నారాయణుడు అయిన విష్ణుమూర్తిని సేవిస్తూ వటవృక్ష మూలమందున్న

జఠాధరుడిని చేరుకుంటాం. అపుడు శ్రీ బ్రహ్మవిష్ణుశివస్వరూపమైన శ్రీ గురుడే మన గురువరుడై మనలను అనుగ్రహిస్తారు అని వారి లీలలు సరదాగా చెప్పుకుని పడుకున్నాం. ఆ రోజు కలలో – పెద్ద వటవృక్షం క్రింద చిన్న కుటీరం, అక్కడ రమణమహర్షి కూర్చుని ఉన్నారు. ఆయన దర్శనార్థమై జనం వరుస క్రమంలో వస్తూ ఉన్నారు. ఆయన చేతిలో ఒక దండం(కర్ర)పట్టుకుని అలా దూరం నుంచే వెళ్ళమని, దగ్గరకు రావద్దని అదిలిస్తూ ఉన్నారు. నేను కూడా దూరం నుంచే ఇది చూచి తల వంచుకుని వెళ్లిపోతూ ఉన్నాను. ఎందుకంటే ఎవరితోనూ అనవసరంగా తిట్టించుకోవటం నాకు ఇష్టం ఉండదు. అలా వెళ్తూ ఉంటే నేను ఆయన దగ్గరకు వచ్చేసరికి తలెత్తి ఆయన, "ఓ నువ్వా! ఇలా రా" అని, నా జబ్బ పట్టుకుని లాగి ఒడిలో కూర్చోపెట్టుకుని గట్టిగా కౌగలించుకున్నారు. అప్పటి నా వయస్సు కూడా 16-19సం||ల మధ్యనే ఉంది. ఆయన నవ్వుతూ అందరితో "చూడండి ఆ జగదాంబలా ఎలా కూర్చుందో" అని, చెప్తున్నారు. కల ముగిసింది. గడియారం చూస్తే 3:30 ఉదయం అయింది. ఆనందంగా ఆ రోజు పారాయణ కూడా మననం 12 సార్లు పూర్తి చేసి దత్త జయంతి పూజ చేసి నా భర్తకు, పిల్లలకు ఈ కల చెప్పగా, వారు సంతోషించి నువ్వు మననం చేసేది మా కోసం వ్రాయవచ్చు కదా, మేం కూడా చదువుకుంటాం అన్నారు. బాబా దయ ఉంటే అలాగే చేస్తాను అని చెప్పాను.

ఒక సారి నా భర్త ఆఫీసుకు కొన్ని రోజులు శెలవు పెట్టి "నేను రోజూ పారాయణ చేద్దాం అనుకుంటున్నాను గురు చరిత్ర వ్రాసి ఇవ్వు"అని ప్రోత్సహించి పట్టుపడితే ఇక తప్పని సరిగా మొదలు పెట్టాను. బొమ్మలతో అయితే లీలలు బాగా మనస్సులో ముద్రితమవుతాయి అని అంటే చిరంజీవులు చిన్నారి సౌభాగ్యవతులు లక్ష్మి ప్రియ, హిమ హాసిని లు బాబా దయతో ఎంతో చక్కగా బొమ్మలు వేసి ఇచ్చారు. ఇలా ఈ దత్త జయంతికి శ్రీగురుడు దయతో మనకు దర్శనం ఇచ్చాడు.

ఎందరో మహానుభావులు వ్రాసిన ఈ గురు కథను మళ్ళీ వ్రాయటం ఎందుకు అని అనిపించవచ్చు. ఒక్కటే జవాబు. నిరతం గురు చరితామృతం గ్రోలుతూ గురువరుని చేరి తరించాలనే కోరికా పరిమళమే ఈ చిరు విరజాజి పుష్పము గురుచరణార్పితము.

-గురుదేవుని గరికపూవు.

ఓం శ్రీ సచ్చిదానంద సమర్ధ సద్గురు శ్రీ సాయినాథ్ మహారాజ్ కీ జై !

# అధ్యాయం- 1

పార్వతీ పరమేశ్వరుల ప్రియపుత్రుడు శ్రీ గణనాయకునికి నమస్సులు !
చదువుల తల్లి సరస్వతి మాతకు నమస్సులు !
సకల దేవతా స్వరూపుడైన శ్రీ సాయినాథునకు నమస్సులు అర్పించి శ్రీ గురుచరితమును పాడుకుందాం!

భగవంతుడు తాను ఒక్కడే అయినప్పటికీ తన సృష్టి వికాస ఆటలో సృష్టికార్యం చేపట్టి తానే అనంతుడు అయ్యాడు. సృష్టి కార్యమునకు బ్రహ్మదేవుడు, స్థితి కార్యమునకు విష్ణువు, ప్రళయ కార్యమునకు పరమేశ్వరుడు తానే అయి త్రిమూర్తులుగా అవతారము ధరించాడు.

మొట్టమొదట సత్యమే తన ఆకారముగా జ్ఞాన వైరాగ్యాలు లక్షణములుగా కృతయుగమును సృష్టి జేసెను. భూమిపై దీని కాలము 17 లక్షలా 28 వేల సం||.

తరువాత యజ్ఞ సామగ్రి ధరించి, యజ్ఞ-యాగాది క్రతువులు లక్షణాలుగా త్రేతాయుగమును సృష్టి జేసెను. దీని కాలము 12 లక్షలా 96 వేల సం||.

తరువాత పరస్పర విరుద్ధమైన భావాలతో అనగా సత్యం – అసత్యం, శాంతి – ఉగ్రత్వం మొదలైన లక్షణాలతో ద్వాపర యుగమును సృష్టి జేసెను. భూమిపై దీని కాలము 8 లక్షలా 64 వేల సం||.

తరువాత కాముకత్వము, జిహ్వా చాపల్యం లక్షణాలుగా పిశాచ రూపం గల కలికాలమును సృష్టి జేసెను. భూమిపై దీని కాలము 4 లక్షలా 32 వేల సం||.

432 కోట్ల సం||లు బ్రహ్మదేవునకు ఒక రోజు దీనికి రెండింతలైన అహోరాత్రాల కాలం బ్రహ్మకు ఒక కల్పం. 3600 కల్పాలు బ్రహ్మదేవుని ఆయుర్దాయము. ఇందులో మొదటిది శ్వేతవరాహ కల్పం. ఇప్పటికి ఈ కల్పములో 28 యుగ చతుష్టయాలు గడిచాయి. ఈ విధముగా 4 యుగాలలో సృష్టింపబడిన జీవులను తరింపజేయుటకై సృష్టికార్యం చేపట్టిన పురుషోత్తముడే తనను తాను వారికి దత్తం చేసుకొని ఆదిగురువై

అవతరించాడు.

జీవులు తమను తాము ఉద్ధరించుకునుటకు ఆదర్శంగా నిలుపుటకే యుగసృష్టికి పూర్వమే మహా యోగులై, బ్రహ్మ నిష్ఠులైన సనకుడు, సనందుడు, సనత్కుమారుడు, సనత్సుజాతలను, ప్రజాపతులైన మరీచి, అత్రి, అంగీరస, పులహ, పులస్త్య, క్రతు, వశిష్ఠులను సృష్టి జేసెను. తరువాత శతరూప మనువులను సృష్టి జేసెను. వీరి కుమార్తె దేవహూతి కర్ధమ ప్రజాపతి భార్య అవగా వీరి కుమార్తె అనసూయాదేవి అత్రిమహర్షి భార్యయై మహాపతివ్రతగా ప్రసిద్ధియై తన పాతివ్రత్యముతో త్రిమూర్తులను మెప్పించి త్రిమూర్త్యాత్మకుడు అయిన పుత్రుడను పొందింది. అతడే అత్రి-అనసూయల పుత్రుడు కనుక ఆత్రేయుడని, సృష్టి వికాసం కోసం తనను తానే దత్తం చేసుకున్న వాడు కనుక దత్తాత్రేయుడని, యుగయుగాన్న గురుపరంపరకు శ్రీకారం చుట్టిన వాడు కనుక పరమగురుడని పిలవబడ్డాడు. ఈ కలి యుగంలో కూడా ఎన్నో అవతారాలు ధరించాడు.

ముఖ్యమైనవి:

- శ్రీపాద శ్రీవల్లభుడు
- శ్రీనృసింహ సరస్వతీస్వామి
- మాణిక్య ప్రభువు
- అక్కలకోట స్వామి
- శ్రీశిరిడి సాయినాధుడుగా ప్రసిద్ధమై దత్తపంచకంగా చెప్పడమైనది.

ఇట్లు యుగయుగాన్న అవతరించుటకు దోహదకరంగా అంబరీషునకు దూర్వాసో మహర్షి ఇచ్చిన శాపాన్ని తానే స్వీకరించాడు .

పూర్వం ఇక్ష్వాకు వంశ రాజైన అంబరీషుడు విష్ణు భక్తుడై ఏకాదశివ్రతం నిష్ఠతో ఆచరించుచుండెను. వ్రత నియమం ప్రకారం ఏకాదశి రోజు నిర్జల ఉపవాసం చేసి మరుసటి రోజు ద్వాదశినాడు సూర్యోదయం అయిన 1.30 గంటల లోపుగా పూజ పూర్తి చేసి ప్రసాదం భుజించవలెను. ఇటులుండగా ఒకనాడు ద్వాదశితిధి ఒకఘడియ మాత్రమే ఉంటుండగా దూర్వాసో మహర్షి శిష్యప్రశిష్యులతో రాజు గృహమునకు విచ్చేసెను. అంబరీషుడు ఆయనను యెంతో గౌరవముతో ఆహ్వానించి పూజించి వెంటనే అనుష్ఠానం ముగించి భోజనానికి రమ్మని పిలిచెను. దూర్వాసుడు స్నానానికి నదికివెళ్ళి ద్వాదశి ఘడియలు మించిపోతున్నా రాకపోవుటవలన రాజు

తనవ్రతభంగం కాకుండా, అతిథిని అలక్ష్యంచేయకుండా మధ్యేమార్గంగా కొద్ధితీర్థం త్రాగగానే మహర్షి వచ్చి తనను విడచి తీర్థం త్రాగినందుకు 'నానా యోనులలో జన్మించెదవు గాక' అని శపించెను. భక్తవత్సలుడైన శ్రీమహావిష్ణువు తన భక్తుని శాపాన్ని తాను పుచ్చుకొని విశ్వాత్ముడై విశ్వకళ్యాణకార్యమునకు విశ్వగురుడై ఇప్పటికీ అవతరిస్తుండెను.

దత్తావతారమైన గురుదేవుని చరితమే శ్రీగురుచరితం. ఇందుచెప్పవలసినదేమన ఎన్ని దత్తావతారములున్నప్పటికీ వారి అవతారకార్యములన్నీ ఒక్కటిగానే ఉండును. ప్రజలలో ధర్మనిష్ఠను పెంపొందించి, మోక్షేచ్ఛను ప్రేరేపించి వారిని ఆ దిశగా ఉద్ధరించటమే.

కలి అంటేనే మలినం, కల్లలకు నిలయం. సత్యం-ధర్మం మృగ్యమైన ఈ కలికాలంలో తరించాలంటే గురువరుడు మాత్రమే సహాయమందించగలడు. తన బోధతో శిష్యుని తనంతవానిగా తీర్చిదిద్దగలడు. గురుసేవలోనే శిష్యుడు తరించగలడు. అట్టి గురుశిష్యుల ప్రాముఖ్యతను వివరిస్తూ, వారిని కంటితో కూడా చూడవద్దని హెచ్చరిస్తూ బ్రహ్మదేవుడు కలిపురుషునకు ఈ కథను చెప్పెను.

గోదావరి తీరంలో అంగీరస ఆశ్రమంలో పైలుని కుమారుడు వేదధర్ముడు అనే మునివరుడు అనేకమంది శిష్యులతో ఉండేవారు. శిష్యుల భక్తి శ్రద్ధలను పరీక్షించదలచి ఆయన "నాయనలారా నాకున్న కొద్ది కర్మశేషమును కుష్ఠు రోగముతో అనుభవించవలసివుంది. కాబట్టి సర్వపాపహరమైన కాశీ క్షేత్రానికి వెళ్ళి అది అనుభవిస్తాను. నాకు సహాయంగా మీలో యెవరైనా రావచ్చును" అని అన్నారు.

దీపకుడు అనే శిష్యుడు "మీ బదులు ఆ కర్మను నేననుభవిస్తాను" అని ముందుకు వచ్చాడు. గురువరుడు లోలోన సంతోషించి బయటకు

"అది నేనే అనుభవించాలి వేరొకరు అనుభవిస్తే తీరదు నాకు తోడుగా నాతో కూడా నీవు రావచ్చు" అని గురుశిష్యులిద్దరూ కాశీ క్షేత్రానికి వెళ్లి, అక్కడ గురువరుడు కుష్టురోగమును పొందగా, శిష్యుడు అతనికి సేవ చేస్తూ నివసించసాగారు. గురువరుని శరీరం కుష్టురోగముతో క్రుళ్లి దుర్వాసన వచ్చి ఆ బాధతో గురువరుడు ఎంతో క్రూరంగా కొట్టినా, తిట్టినా దీపకుడు ఎంతో ఓర్పుతో, భక్తితో గురుసేవ చేస్తూ 21 సం||లు గడిపారు.

అతని గురుభక్తికి మెచ్చి, కాశీ విశ్వనాథుడు, శ్రీమన్నారాయణుడు

ప్రత్యక్ష్యమై “నాయనా , నీవంటి శిష్యోత్తమునకు మేము ఆధీనులం. యేదైనా వరం కోరుకో” మనెను.

అపుడు దీపకుడు “స్వామీ నా గురుభక్తి నిరంతరం వృద్ధి చెందేలా దీవించండి” అని కోరెను. “నాయనా గురుభక్తితో నీవు లోకపూజ్యుడవు కాగలవు” అని ఆశీర్వదించి వారు అంతర్ధానమయిరి.

తరువాత వేదధర్ముడు, దీపకుని చూసి “చిరంజీవ! నీవు కాశీలోనే నివశించు, అష్టసిద్ధులు-నవనిధులు నిన్ను సేవిస్తుంటాయి, నిన్ను స్మరించిన వారి కష్టాలు నశిస్తాయి.” అని ప్రేమతో ఆశీర్వదించి, ఆరోగ్యవంతుడైనాడు. గురుమహిమ ఇంతటిది అని సిద్ధసరస్వతీస్వామి నామధారకునకి పై కథను చెప్పెను.

మరి ఇంతటి అమూల్యమైన గురువరుడు మనకి ఎచట దొరకును ? ఆతని అమృతతుల్యమైన అనుగ్రహం మనపై ఎటుల కురియను? అని మనం కలవరపడడం తోడనే ఆతని దయామయ చల్లని మలయమారుతం మనలను ఆవరించెనని గుర్తు. దానికి తోడు నిరతమూ ప్రేమతో గురుచరితం ఆలపించగా గురువరుడు కూడ ద్విగుణీకృత ప్రేమతో తనంత తానే మన కడకు వచ్చి తన కరుణామృతధారలు మనపై కురిపించి మనల మురిపించును. సిద్ధసరస్వతి నామధారక సంవాదమైన ఈ గురు కథను, శ్రీ భరద్వాజ మాష్టరుగారు రచించిన ఈ గురుకథను, నా గురువరుని పాద పద్మములకు నన్ను చేర్చిన ఈ గురుకథను భక్తితో పాడుకుందాం.

## శ్రీగురుచరితం అమృత భరితం
## నిరతం గ్రోలిన బ్రతుకే మధురాతిమధురం.

పవిత్రగోదావరి తీరం, పిఠాపురం, పావన అగ్రహారమందు సుమతి-అప్పలరాజుశర్మ అనే పుణ్యదంపతుల ఇంట ఒక అమావాస్య తిథినాట శ్రాద్ధకర్మ ఆ పూట. బ్రాహ్మణ భోక్తలు భుజించకమున్నే దత్తాత్రేయుడే సన్యాసి వేషంన భిక్షువై వచ్చె. వచ్చినది తమ కులదైవమైన దత్తుడేనని తలంచి ఆ సతీమ తల్లి భిక్ష ఇచ్చె. సుమతీదేవి భక్తి శ్రద్ధలకు సంతసించిన దత్తాత్రేయుడు భాద్రపద-శుక్ల-చతుర్థీ నాడు ప్రియ పుత్రుడై శ్రీ పాదుడు అనే పేరున వెలసే వరాలపంటై. యెనిమిదవ యేట శ్రీ పాదునకు ఉపనయనం చేయగా

యజ్ఞోపవీత ధారణతోనే ఆతను వేదగానం చేసె.

పదహారేండ్ల ప్రాయములో కుంటి-గ్రుడ్డి అయిన తన అన్నలను స్పృశించి స్వస్తుల చేసి సన్యాసాశ్రమ స్వీకారంతో తల్లి-దండ్రులకు ప్రణమిల్లి అనుజ్ఞపొంది పాదచారియై ద్వారక, కాశీ, బృందావనం, బదరి దర్శించి గోకర్ణ క్షేత్రానికి పయనమాయె.

గోకర్ణ క్షేత్రమున మహాబలేశ్వరలింగ రూపమున కొలువున్నది సాక్షాత్ శంకరుడని, ప్రతిష్ఠించినవారు గణేశుడని, కైలాసంనుంచి రావణునిచే భూలోకానికి తీసుకురాబడినదని, శివుని ఆత్మలింగం మహాబలంగా భూమిలోనికి పాతుకుపోవడంతో మహాబలేశ్వరం అయిందని, ఈ లింగం ఆవు చెవి ఆకారం పోలి ఉండటంతో గోకర్ణం అనే పేరు వచ్చిందని చెప్తూ సిద్ధుడు ఈ క్షేత్ర మహిమను వివరించె ఈ కధా రూపంన.

పూర్వం ఇక్ష్వాకు వంశమున మిత్రసహుడనే రాజు వేటకై వెళ్ళి క్రూర రాక్షస సంహారం చేసె. ఆ రాక్షస సోదరుడు రాజుపై కక్ష సాధింప సేవకుని రూపంన  చేరె, రాజు ఇంటిలో. పితృ-శ్రాద్ధ కర్మలో కపటంగా నరమాంసము కలిపే వంటలో. దీని గ్రహించి గురు వశిష్ఠ మహర్షి రాజుపై కోపించి బ్రహ్మరాక్షసుడవవుదవని శపియించె. జరిగిన తప్పిదం తనకు తెలియని కారణమున రాజు బాధచెంది, వశిష్టునకు ప్రతిశాపం ఇవ్వబోగా గురువుని శపింపబూనటం  మహాపాపమని భార్య దమయంతి ఆ శాప జలమును అతని పాదాలపైనే పోసుకొమ్మనగా, అంతట ఆతడు అటుల చేసి కల్మషపాదుడయ్యె. వశిష్టుడు జాలి చెంది 12సం||ల పిమ్మట శాప విమోచనం అగునని దీవించె.

బ్రహ్మరాక్షస రూపమున రాజు ఒక బ్రాహ్మణుని చంపి, తినిన కారణమున ఆ బ్రాహ్మణుని భార్య ఆవేదనతో వశిష్టశాపం తీరిన తదుపరి భార్యాసంగమంతో నశించెదవని శాపమిచ్చె. గురుశాపము తీరి నగరమునకు వచ్చిన రాజు ఈ విషయమై కలత చెంది భార్యతో కూడి తీర్ధయాత్రలు చేయగా మార్గమధ్యమున గౌతమ మహర్షికి తమ విషాద గాధను వివరించె. అంత గౌతమ మహర్షి గోకర్ణ క్షేత్రం పవిత్రమైనదని ఇచ్చట సౌదామిని అనే బ్రాహ్మణకన్య పతితురాలైనను తెలియక చేసిన శివ పూజతోనే పుణ్యాత్మురాలైనదని చెప్పి గోకర్ణ క్షేత్రమున కొలువైన మహాబలేశ్వరుని పూజింపమని ఆశీర్వదించె. రాజు అచట శివ పూజ చేసి శాప విముక్తుడయ్యె.



గురుభక్తి తో త్రిమూర్తులను మెప్పించి గురువు ఆశీర్వాదం పొందుతున్న దీపకుడు.



సుమతీ తల్లి భక్తి శ్రద్ధలకు సంతసించి,వారి ఇంట శ్రీ పాదుడుగా వెలసిన దత్తాత్రేయుడు.



మిత్రసహునికి గోకర్ణక్షేత్రంలో పతితురాలైన సౌదామిని తెలియక చేసిన శివ పూజతో శివ సాయుజ్యమును పొందిన గోకర్ణక్షేత్ర  మహిమను వివరిస్తున్న గౌతముడు.



శ్రీపాదుడు అంబిక తో శివ పూజా మహత్యంను వివరిస్తున్న కథలో గోపబాలుని భక్తికి మెచ్చి దర్శనమిచ్చిన శివపార్వతులు.

అందుకే ఈ క్షేత్ర మహాత్యాన్ని పునరుద్ధరించుటకై శ్రీపాదుడు ఇచట 3సం||లు నివశించె.

తరువాత శ్రీ శైలంలో 4 నెలలు ఉండి నివృత్తి సంగమం చేరి తదుపరి కృష్ణా-వేణి రెండు నదుల కలయికతో పవిత్రమైన కురువపురమందున తన నివాసం చేసె. అచ్చట వేదవిదుడైన ఒక సధ్బ్రాహ్మణునికి మహాపతివ్రత అయిన తన భార్య అంబికకు కలిగిన గారాల పుత్రుడు బుద్ధిహీనుడు కాగా గ్రామస్తుల పరిహాసాలకు మనస్సు విరిగి ఆత్మహత్యకు పాల్పడగా తల్లీ-బిడ్డలను వారించి, ఆ బిడ్డను పండితునిగా దీవించి, శ్రీ పాదుడు శివపూజ మహాత్యంను వివరించి, అంబికతో జీవితమంతా శివపూజ చేయించి, ఫలితంగా తానే కుమారుడై జన్మించగలనని వరమిచ్చి ఈ క్రింది కథను వినిపించె.

ఉజ్జయినినేలే చంద్రసేనుడనే రాజు, అతని మిత్రుడు మణిభద్రుడు, శివ భక్తులై పూజ చేయ, అది చూసి పట్టణ గోపబాలురు కూడా వారి ఇంటిముంగిళ్ళను ఆకులతో అలంకరించి, శివపూజలు చేస్తుండె. వారిలో ఒకని తల్లి పూజ పూర్తి కాకుండా, భోజనంనకు బిడ్డను లాక్కొని పోవ, పూజ విఘ్నం అయినందుకు ఆ బాలుడు దుఃఖించి, మరణంనకు పాల్పడగా శివుడు ప్రత్యక్షమై బాలుని దీక్షనుమెచ్చి, శివ సాయుజ్యం ప్రసాదించె. అతని తల్లి తెలియక అపరాధం చేసినా శివ పూజను చూసినందున ఆమె మరుజన్మలో విష్ణుజనని అవుతుంది అని దీవెనలిచ్చె.

ఈ గ్రామంలో ఒక చాకలి శ్రీపాదస్వామి భక్తుడై సేవించుచుండగా ఒక రోజు నదిలో బట్టలు ఉతుకుతుండగా తన చెలుల కూడి జలకాలాడుచున్న ఒక యవన రాజును గని రాజ భోగాలపై మోహం జనియించటంతో శ్రీపాదస్వామి ఆ చాకలిని మరుజన్మలో యవన రాజువై రాజ్యమేలుదువని వరమిచ్చి, ఆశ్వయుజ మాసం, కృష్ణద్వాదశి, హస్తా నక్షత్రమున కృష్ణా నదిలో అంతర్హితమయ్యె.

## శ్రీ గురవే నమః

# అధ్యాయం -2

శ్రీపాదస్వామి కృష్ణా నదిలో అంతర్హితమైనను సూక్ష్మ రూపంలో కురువపురమందు నివాసం చేస్తూ ఆశ్రితులను రక్షించుచున్నారను దానికి తార్కాణంగా సిద్ధయోగి ఈ కథాగానంన  తెలిపె. కాశ్యపన గోత్రికుడైన వల్లభేశుడనే అనే బ్రాహ్మణుడు శ్రీపాదస్వామి భక్తుడై ఉండగా, ఆతనికి వ్యాపారంలో లాభం వస్తే కురువపురంలో 1000 మంది బ్రాహ్మణులకు భోజనం పెట్టెదనని మ్రొక్కు చెప్పె.

అంతట మంచి లాభాలు పొంది కురువపురంనకు పయన మయ్యె. మార్గమధ్యములో దొంగలు ఆతనిని హతమార్చి ధనం అపహరించె. మరణంనకు ముందు వల్లభేశుడు "శ్రీపాదా" అని గట్టిగా కేక వేయగా, అంతట శ్రీపాద శ్రీవల్లభుడు భక్తరక్షకుడై జడలు, భస్మం, త్రిశూలం ధరించి వచ్చి యతిరూపంలో దొంగల సంహారం చేసి వల్లభేశుని తిరిగి జీవింపచేసె. అంత వల్లభేశుడు అమితానందభరితడై 1000 మంది బ్రాహ్మణులకు కాక, 4000 మంది బ్రాహ్మణులకు తృప్తిగా నివేదనలిచ్చె.

భక్తుని ఆయుధం దైవనామస్మరణ. అట్టి స్వామి స్మరణకు అనుగుణమైన గానం:

### దిగంబరా  దిగంబరా  శ్రీపాదవల్లభ దిగంబరా !

### దిగంబరా దిగంబరా అవధూత చింతన దిగంబరా !!

పూర్వం శ్రీపాదస్వామి ఆదేశానుసారం అంబికా దేవి జీవితమంతా శివ పూజలో పునీతమాయె. మరు జన్మలో ఆమె మహారాష్ట్రలో లాడకారంజా అను గ్రామమున 'అంబ' అనే నామధేయంతో బ్రాహ్మణుల ఇంట జనియించె. శివ పూజ అనే గొప్ప సంస్కారం వలన శివవ్రతుడైన మాధవశర్మ అనే బ్రహ్మణోత్తమునితో వివాహమాయె. పతియే పరమేశ్వరుడని భావించి ఆమె నిత్యం భర్తను సేవింప, 16సం|| లకు శ్రీపాద స్వామియే పూర్వం ఆమెకు ఇచ్చిన మాట ప్రకారం, ఆమె గర్భవాసాన ఉదయించె.

ఏడ్చుటకు బదులుగా ప్రణవముచ్ఛరించు ఆ బాలునకు 'శాల

గ్రామదేవ' అని పేరిడి, 'నరహరి' అని ప్రేమగా పిలువ సాగె.

బాలునకు చాలినన్ని తల్లి పాలు తన వద్ద లేక అంబ కలత చెందె. చిన్నారి తండ్రి చిన్ని-చిన్ని చేతులతో అమ్మ వక్షస్థలం స్పృశియించగా, ఆమెకు స్థన్యము వెల్లువై 32 ధారలుగా కారె.

నిత్యం ప్రణవముచ్ఛరిస్తూ, మాటలు చెప్పని కారణంన తల్లిదండ్రులు దుఃఖించగా నరహరి వారిని ఊరడించి ఇనుప వస్తువులను బంగారు చేసి తన మహిమను చూపె.

ఉపనయనం తరువాత మాట్లాడుతానని సైగల ద్వారా తెలిపి, ఉపనయనం అయిన తదుపరి గాయత్రి మంత్రం మనస్సులో జపించి "భవతి భిక్షాం దేహి" అని తల్లిని భిక్ష కోరి మొట్టమొదట ఆమెతోనే మాట్లాడె. తదనంతరం 4 వేదాలు అనర్గళంగా గానం చేసి , సన్యాసాశ్రమమునకు తల్లిదండ్రుల అనుజ్ఞ కోరె. పుత్ర వాత్సల్యమున అంబా దేవి- మాధవశర్మలు దుఃఖించగా వారికి తన విశ్వ రూపమును చూపె నరహరి దత్తాత్రేయుడై.

మరి బిడ్డలు లేనందున ఇంకొక బిడ్డ పుట్టేవరకు ఇంట ఉండమని నరహరిని ప్రార్థింప తల్లి మాటను మన్నించి, మరుసటి సంవత్సరం తల్లికి కవలలు పుట్టేవరకూ కనుల పండగ చేస్తూ శ్రీస్వామి, వారితో నివసించి, స్మరించిన తక్షణమే దర్శనమిచ్చెదనని మాట ఇచ్చి, మళ్ళీ 30సం||లు తరువాత వచ్చెదనంటూ సన్న్యాసాశ్రమానికి పయనం కట్టె.

తలపై శిరస్త్రాణము, చేతదండం, కౌపీనం, కాషాయాంబరం ధరియించి, చిరునవ్వులొలికేటి చిన్నారి గురుడు బదిరుల బ్రోవంగ బదరీనాథ్ దిక్కుగా బయలుదేరి కాశీలో ఆనంద కాననం చేరి గంగలో స్నానం చేసి, ఆత్మ స్వరూపమైన విశ్వనాథుని దర్శించి, సత్సాంప్రదాయ పునరుద్ధరణకై జ్ఞానవృద్ధులైన కృష్ణసరస్వతి స్వాముల శిష్యుడాయె.

పూర్వం శ్రీరామచంద్రుడు వశిష్టమహర్షిని, శ్రీకృష్ణుడు సాందీపనిమహర్షిని గురువుగా వరించినటుల ఈ గురు సంప్రదాయం అనాది సిద్ధం. దీనికి మూలపురుషుడు సదాశివుడు. ఆయన శిష్యుడు విష్ణువు. విష్ణువుకు శిష్యుడు బ్రహ్మదేవుడు. బ్రహ్మదేవుడినుండి వశిష్ఠుడు- శక్తి- పరాశరుడు- వ్యాసభగవానుడు- శుకబ్రహ్మ- గౌడపాదుడు-గోవింద భగవత్పాదులు- శంకర భగవత్పాదులు- విశ్వరూపుడు- బోధజ్ఞానగిరి- సింహగిరి- ఈశ్వరతీర్థుడు- నృసింహతీర్థుడు- విద్యారణ్యుడు-

మలయానందుడు- దేవతీర్థుడు- యాదవేంద్ర సరస్వతి-కృష్ణ సరస్వతి స్వామి.

ఈ కృష్ణసరస్వతి స్వామి వారిని గురువుగా వరించి శ్రీగురుడు శ్రీనృసింహసరస్వతిస్వామి అని పేరు గ్రహించె.

తదుపరి శ్రీగురుడు మేరు పర్వతానికి ప్రదక్షిణ చేసి, గంగా సాగరసంగమం చేరి ప్రయాగలో మాధవుడు అనే బ్రాహ్మణునికి తత్వోపదేశం చేసె. ఆయనకు ఎంతోమంది శిష్యులున్నా ముఖ్యమైన 7 గురు శిష్యులు- మాధవుడు, సిద్ధుడు, బాలుడు, ఉపేంద్రుడు, జ్ఞానజ్యోతి, సదానందుడు, కృష్ణుడు. వీరిని వెంటనిడుకొని తీర్థయాత్రలు చేస్తూ, కారంజానగరం చేరి మాతృదర్శనం చేసి, పూర్వాశ్రమంలో తమ సోదరియైన రత్నను అనుగ్రహించి, నాసిక్ వెళ్ళె.

ఇచట గౌతమ మహర్షిచే కైలాసం నుంచి భూమికి తేబడి "గౌతమి" అయిన గంగ పుట్టుక స్థానమైన త్రయంబకంను దర్శించి మంజరీకరం క్షేత్రమునకు చేరె. అచట మాధవారణ్యుడు అనే నృసింహ భక్తునికి ధ్యానమందున శ్రీగురుదర్శనం ఆయె. తదుపరి వాసరబ్రహ్మేశ్వర క్షేత్రమున బ్రాహ్మణునికి ఉదరశూల రోగమును నివారణ చేసె. ఆ గ్రామమున కౌండిన్యస గోత్రజుడు సాయందేవుడు అను బ్రాహ్మణుడు శ్రీగురునికి నమస్కరించి, తన ఇంటికి ఆహ్వానించె. శ్రీగురుడు ఆతని ఆహ్వానాన్ని మన్నించి శిష్య సమేతుడై వారి ఇంట మధుర భక్ష్య భోజ్యాదుల ఆతిధ్యం స్వీకరించె. సాయందేవుడు భుక్తికై బ్రాహ్మణ ద్వేషి అయిన యవనరాజు కొలువున పనిచేయుచుండ, శ్రీగురుడు యవనుని అకృత్యం నుండి సాయందేవుని రక్షించి అతనిని శిష్యునిగా స్వీకరించె.

శ్రీగురుడు వైద్యనాధం చేరి గృహస్థ శిష్యులకు కర్తవ్య కర్మకాండ తెలిపి వారి వారి గృహములకు పంపె. సన్యాస శిష్యులకు దర్శించ వలసిన తీర్థాలు, క్షేత్రాలు తెలిపి వారినాదిశల అనిపె.

తదుపరి శ్రీగురుడు వైద్యనాధమున 1సం|| కాలం గుప్త జీవనం సాగించె.

అచట గురువుని త్యజించిన ఒక అజ్ఞాని అయిన బ్రాహ్మణుడు వచ్చి శ్రీగురునికి నమస్కరించి, ఉపదేశం కోరె. శ్రీగురుడు ఆతని మందలించి గురు సేవా మహత్యం తెలిపి ఆతని ఉద్ధరించె, ఈ వివరమున.

ద్వాపర యుగంన ధౌమ్యుడు అనే బ్రహ్మర్షికి అరుణి, బైదుడు, ఉపమన్యువు అనే ముగ్గురు శిష్యులుండె. గురువు వారిని పిలిచి, అరుణికి పొలానికి నీరు పెట్టమని, తదుపరి బైదునికి పంట కోసి ఇంటికి తెమ్మని పనులు పురమాయింప కడు శ్రద్ధతో, పలు కష్టాలకోర్చి వారు ఆ పనులు చేసి గురు ఆశీర్వాదమును పొంది సకల శాస్త్ర పారంగతులైరి. 3వ శిష్యుడైన ఉపమన్యువు అతిగా తింటూ మంద బుద్ధి కల వాడై ఉండగా గురువు అతనికి అడవికి పోయి పశువులను మేపే పని అప్పగించె. అతడు ఆకలికి ఓర్వలేక అక్కడకు దగ్గరలో ఉన్న వారి ఇండ్లనుంచి, భిక్ష స్వీకరించి, తదుపరి పశువులనుంచి పాలుత్రాగి ఆకలి తీర్చుకుంటుండె. అటుల చేయవలదని గురువు ఆజ్ఞాపించ, ఆకలికి ఓర్వలేక జిల్లేడు మొక్కనుంచి పాలు పిండుకొనుచుండ అవి కంట్లోకి చిమ్మి, కన్ను కానరాక బావిలో పడె. గురువు వచ్చి, అతని దుస్థితికి జాలి చెంది బయటకు లాగి, శిష్యుని గురుభక్తికి సంతసించి, అతనిపై తన కృపా దృష్టి సారించె. అంతట ఆతడు సకల విద్యా సంపన్నుడై, నాగలోకాన్ని జయించి, నాగ కుండలాలు గురు దక్షిణగా సమర్పించ గలిగే గురుభక్తి గల ఉద్ధండులైన శిష్యులను గడించె. ఈ విధంగా వివరించి, శ్రీగురుడు ఆ బ్రాహ్మణుని కి తన గురువును చూపె. అతడు గురువు అనుగ్రహమును పొంది ధన్యుడాయె.

అటు పైన శ్రీగురుడు కృష్ణాతీరమున భిల్లవటీ గ్రామమున భువనేశ్వరీ దేవి సన్నిధిన కృష్ణా-వేణి సంగమం పడమట తీరాన ఔదంబర వృక్షం క్రింద గుప్త నివాసం చేసె. అచట కరవీర పురమున వేదశాస్త్ర పారంగతుడైన కణ్వశాకీయుడైన ఒక బ్రాహ్మణ బాలుడు అనాథుడు, బుద్ధిమాంద్యుడు కావటాన గ్రామస్తుల నిందలకు విసిగి, భువనేశ్వరి దేవి సన్నిధి చేరి తన నాలుక కోసి దేవికి అర్పించె.

దేవి జాలి చెంది ఆ బాలునికి కలలో కనిపించి కృష్ణా నదికి పడమటతీరాన ఉన్న శ్రీగురుని సేవించమని చెప్పె. ఆ బాలుడు అటులనే చేయగా శ్రీగురుడు ప్రసన్నుడై ఆతని ఆశీర్వదించె.ఆ వెంటనే బాలునకు నాలుక మొలిచి, మహాపండితుడాయె. శ్రీగురుని నివాసం వలన ఆ ప్రదేశం 'ఔదంబర్' అనే ప్రఖ్యాత దత్తక్షేత్రమాయె.

ఈ లీలతో శ్రీగురుని మహాత్యం గుప్పుమని లోకానికి సుగంధాలు వెదజల్లగా, తమ గుప్త జీవితం విడచి, శ్రీగురుడు లోకప్రసిద్ధుడై వరుణా

సంగమం చేరి అక్కడనుండి కృష్ణా తీరంలో ఉన్న తీర్ధాలలో స్నానం చేస్తూ కృష్ణా-పంచనదీ సంగమం – అనగా శివ, భద్ర, భోగవతి, కుంభి, సరస్వతి అను 5 పవిత్ర నదులు ఒక్కటై కృష్ణానదిలో కలిసే మనోహర తీర్థం వద్ద 12సం||లు నివశించె. ఇదియే ప్రసిద్ధమైన 'నర్సోబావాడి' లేదా 'నృసింహవాడి' అనే ప్రఖ్యాత దత్త క్షేత్రమాయె. ఇక్కడ అమరపురంలో కొలువైన అమరేశ్వరుడు సాక్షాత్ కాశీ విశ్వేశ్వరుడే, ఇచ్చట మేడు చెట్టు కల్పవృక్షమే. ఇక్కడ ఉత్తరాన శుక్లతీర్థం, ఉదుంబర వృక్షం దగ్గర పాపనాశతీర్థం, కామ్యతీర్థం, వరదతీర్థం, సంగమాన శక్తితీర్థం, చామరతీర్థం, కోటితీర్థం అనే అపారమహిమ గల తీర్థాలెన్నో కలిగి గొప్ప క్షేత్రమాయె.

శ్రీగురుడు ప్రతిరోజు అమరపురమునకు భిక్షకు వెలుతుండ, ఒక నాడు పరమ సాధ్వికుడు, యాయవార వృత్తితోనే జీవిస్తూ ఉండే ఒక పేద బ్రాహ్మణుని ఇంటికి వెళ్ళి 'భిక్షాం దేహి' అంటూ నిలబడె.

ఆరోజు వారి ఇంట ధాన్యం లేని కారణంన వారి ముంగిలిలో ఉన్న తుమ్మపాదు నుంచి కాయలు కోసి వండి, స్వామికి భక్తితో సమర్పించె. శ్రీగురుడు అతని భక్తికి సంతసించి, ప్రీతితో ఆరగించి, "ఐశ్వర్యాభివృద్ధిరస్తు" అని ఆశీర్వదించి సాగిపోతూ ఆ తుమ్మపాదును త్రుంచి వైచె. అది గాంచి ఇల్లాలు దుఃఖించగా, ఆ బ్రాహ్మణుడు ఆమెను ఓదార్చి తిరిగి ఆ మొక్కను నాటాలని త్రవ్వగా అట బంగారు నిధి లభించి దంపతులు ఆనందించె. తమ బిడ్డలను తోడ్కొని పరివారమంతయు వెళ్ళి శ్రీగురుని దర్శించి నమస్కరించె.

ఇచ్చట ఉదుంబర వృక్షం(మేడు చెట్టు)యొక్క మహిమను సిద్ధయోగి వెల్లడి చేసె. హిరణ్యకశిపుని సంహారమునకు శ్రీమహావిష్ణువు నరసింహావతారం ఎత్తి తమ గోళ్లతో ఆ రాక్షసుని చంపినపుడు దుష్టమైన వాని రక్తం స్వామి గోళ్లకు అంటుకొని మంటపుట్టగా, శ్రీమహాలక్ష్మి మేడు పళ్లతోనూ, ఆకులతోనూ తుడిచి భాధను ఉపశమింపచేయగా, స్వామి ఆనందించి, మేడు చెట్టును పూజించి, చెట్టునీడన భక్తితో చేసిన జపధ్యానాదులు విశేషమైన ఫలితమీయగా, విష భాధలు తొలగి అభీష్టాలు నెరవేరగలవని మేడు చెట్టుకు వరమిచ్చి ఇప్పటికీ లక్ష్మి సమేతుడై ఇచట కొలువుంటాడని అందుకే దత్తవతారమైన శ్రీగురుడు ప్రీతితో ఈ ఉదంబర వృక్ష మూలంన నిత్యనివాసం చేస్తారని సిద్ధయోగి తెలిపె.

ఇక్కడ అమరేశ్వరుని సన్నిధిలో ఉన్న 64 మంది యోగినిలు

ఉదుంబర వృక్షం క్రింద ఉన్న శ్రీగురుని దర్శించి, పూజించి పంచ భక్ష్య పరమాన్నములు నివేదనలిచ్చె. ఈ ప్రాంతంలో గంగానుజుడు అనే రైతు తన పొలంపని చేసుకొనుచుండ అద్భుతమైన దృశ్యం కంటపడె. నదీ జలం అడ్డంగా రెండుగా చీలి, అందుండి యోగినులు వచ్చి శ్రీగురునికి నమస్కరించి, ఆయనను తీసుకొని, నదిలోకి వెళ్ళి అచట సుందరమైన భవనంలో సింహాసనంపై శ్రీగురుని కూర్చుండజేసి షోడశోపచార పూజలు చేయ గంగానుజుడు అదియెల్ల వింతగా చూసి శ్రీగురుడు సాక్షాత్ పరమేశ్వరుడే నని నమస్కరించె. శ్రీ గురుడు ఆతని ఆశీర్వదించి, చూచినది ఇప్పుడే ఎవ్వరికీ వెల్లడి చేయవద్దని హెచ్చరించి, త్రిస్థలి అయిన కాశీ, గయా, ప్రయాగల దర్శనం చేయించె. ఈ కృష్ణా పంచనదీ సంగమం, యుగాలయం, కరవీరం అనే మూడు కూడా త్రిస్థలి అంతటి మహిమ కలవని గంగానుజునికి ఈ క్షేత్ర మహత్యమును వెల్లడి చేసె. శ్రీగురుని దర్శన ఆశీశ్శులతో గంగానుజుడు తన పొలం లో నిధిని పొంది సంతోషం తో శ్రీగురుని పూజించి తరించె.

ఇక్కడ శ్రీగురుడు తన అవతారం సూక్ష్మ రూపంన మరుగు పరిచి, పాదుకలను నిలిపి ఉంచె. అన్నపూర్ణా దేవిని స్వయంగా ప్రతిష్ఠించి, ఆశ్వయుజ బహుళ ద్వాదసి నాడు గంధర్వ పురమున భీమా-అమరజా సంగమానికి వెళ్ళి చేరె.

అయినప్పటికి ఈ ఉదుంబర వృక్షం క్రింద శ్రీగురుడు నిత్య సత్యుడై కొలువై ఉన్నాడు అనే దానికి నిదర్శనమే ఈ శిరోల కథనం.

శిరోల అను గ్రామమందు శాంతిదేవి – గంగాధరుడు అనే పుణ్య బ్రాహ్మణ దంపతులకు పుట్టిన బిడ్డలు అందరూ దక్కక పోవటంతో ఆ దంపతులు శోకించి, దీనికి కారణం, నివారణం తెలుపమని దైవజ్ఞులను వేడుకొనగా పూర్వ జన్మమందు చేసిన పాపమిది అని చెప్పె. గత జన్మలో ఆమె ఒక శౌనక గోత్రీకుడు అయిన బ్రాహ్మణుని నుంచి, 100 రూ||లు అప్పు తీసుకొని, తిరిగి తీర్చనందున, ఆ తీరని దిగులుతో బ్రాహ్మణుడు ఆత్మ హత్య చేసుకొని, పిశాచమై, ఈ జన్మలో పుట్టిన బిడ్డలను పొట్టను పెట్టుకుంటున్నాడని తెలిపె. దానికి ప్రాయశ్చిత్తంగా, ఒక మాసం కృష్ణా-పంచనదీ సంగమం స్నానమాచరించి, శ్రీగురుపాదుకలను పూజించి మేడుచెట్టుకు ప్రదక్షిణం కావించి, యధా శక్తి బ్రాహ్మణులకు దానమిప్పించమని సూచించె. ఆమె

దీక్షగా అటుల చేయుచుండ ఓ నాడు కలలో ఆ పిశాచం కనపడి మీదకు రాగా ఆమె భయబడి శ్రీగురుని శరణు వేడె. శ్రీగురుడు ఆ పిశాచ బ్రాహ్మణుని అడ్డుకొని, సద్గతిని ప్రసాదించి, శాంతాదేవికి అభయమిచ్చి వేదవిదులైన బిడ్డలు కలుగుతారని ఆశీర్వదించె. తదుపరి కొద్ది కాలానికి కల ఫలియించి, శ్రీగురుని ఆశీర్వాదమున ఆమెకు 2రు కుమారులు జనియించె. పెద్దవానికి 7 సం||లు రావటంతో ఉపనయనం చేయాలని, రెండవ వానికి 3సం||లు రావటంతో చౌలసంస్కారం చేయాలని ముహూర్తం నిర్ణయించగా, వెంటనే పెద్ద బాబుకి ధనుర్వాతం వచ్చి అకస్మాత్తుగా చనిపోయె. ఆతల్లి ఎంతోశోకించి, శ్రీగురుడు ఇచ్చిన వరం నిష్ఫలం కాదంటూ నమ్మి బిడ్డను ఎత్తుకొని ఉదుంబర వృక్షం క్రింద ఉన్న శ్రీగురుని పాదుకల వద్దకు చేరి, బాధతో తలను బాదుకొని, పాదుకులను రక్తం తో తడిపి వేసి, సొమ్మసిల్లి పడిపోయె. ఆ మగతలో ఆమెకు శ్రీగురుడు కనిపించి చనిపోయిన బిడ్డలో ఊపిరిని ఊదె. కలనుంచి మేలుకొని చూడగా నిజముగానే ఆ బిడ్డ లేచి కూర్చుని అమ్మ! అని పిలువగా, ఆ దంపతులు ఆనందించి, శ్రీగురుని కరుణకు సాటి వేరొకటి లేదని తీర్థజలాలు తెచ్చి గురు పాదుకులను శుద్ధిపరిచి పూలతో అభిషేకించె.





ఇనుమును తాకి బంగారం చేసి తల్లితండ్రులకు చూపుతున్న నరహరి.



భిల్లవటిలో భువనేశ్వరిదేవి సన్నిధిన మంధ బాలుడు తన నాలుక కోసి దేవికి సమర్పిస్తున్న దృశ్యం.



అమరేశ్వరుని సన్నిధిలో యోగినులు శ్రీ గురుని సేవించటం సంభ్రమాశ్చర్యాలతో తిలకిస్తున్న గంగానుజుడు.



చనిపోయిన బాలునికి ఊపిరి ఊది తిరిగి జీవితుని చేసి నరసింహవాడిలో శ్రీ గురుడు నిత్య సత్యుడై వెలుగొందుతున్న శిరోల కథనం.

## శ్రీ గురవే నమః

# అధ్యాయం -3

శ్రీగురుడు గంధర్వపురం చేరి భీమా-అమరజా సంగమం వద్ద ఉన్న అడవులలో సంచరిస్తూ గుప్తంగా సాధుజీవనం గడుపుతూ భిక్షువై గంధర్వపురమునకు వెళ్తుండె. ఒకనాడు గుణవంతుడు అయిన పేద బ్రాహ్మణుని ఇంటికి భిక్షకు పోగా, యాయవారంనకు వెళ్ళిన యజమాని ఇంకనూ రాలేదని, కాసేపు వేచి ఉండమని ఇల్లాలు వేడుకొనగా, శ్రీగురుడు వారి ఇంటి ముంగిట ఉన్న గొడ్డు బఱ్ఱెతో 2 కడవలు నిండుగా పాలు ఇప్పించి, కొంచెం పాలు ఇమ్మనె. ఇల్లాలు సంతోషంన పాలు కాచి , శ్రీగురునికి అర్పించ, కడుపార పాలారగించి, "అఖండైశ్వర్యాభివృద్ధిరస్తు" అంటూ ఆశీర్వదించి, తిరిగి సంగమానికి మరలె.

ఈ వింత తెలిసి నగరమేలే రాజు వచ్చి శ్రీగురునకు నమస్కరించి, పురమునకు రమ్మని ప్రార్ధన చేసె. రాజు ప్రార్ధనను మన్నించి, శ్రీగురుడు పల్లకినధిరోహించి వచ్చుచుండ, నిర్మానుష్యమైన నగరనడి బొడ్డున అశ్వత్థ వృక్షం పైనున్న బ్రహ్మరాక్షసుడు శ్రీగురునికి నమస్కరించగా అతనికి ముక్తిని ప్రసాదించి, అచ్చటనే మఠము నిర్మించి ఇమ్మని రాజునాజ్ఞాపించి , అక్కడనే నివసించ సాగె. అక్కడికి కొద్ది దూరంలో కుమసిగ్రామంలో ఉన్న త్రివిక్రమ భారతి అనే సన్యాసి రోజూ ధ్యానంన నరసింహావతారమును పూజించుచుండె. అతను శ్రీగురుని గూర్చి 'పల్లకీలో ఊరేగు ఈ యతి దాంభికుడు' అంటూ ఆక్షేపణ చేసె. దానిని తొలగించుటకై శ్రీగురుడు, త్రివిక్రమునకు ధ్యానంన నరసింహుని స్థానమున కనిపించి, నదీ తీరంనకు రమ్మని దివ్య సందేశమిచ్చె. నదీతీరమునకు త్రివిక్రముడు రాగా సర్వం యతిరూపమున సాక్షాత్కరించె. త్రివిక్రమునికి గల సంశయం తీరి, తన ఇష్ట దైవమైన నరసింహుని ప్రతిరూపమైన శ్రీగురుని పాదాల పడి వేడగా, శ్రీగురుడు ఆతని మన్నించి గురువై ఆశీర్వదించె.

ఒకప్పుడు వైఢూర్య నగరంను కఠినాత్ముడు హిందూమతద్వేషి అయిన యవనరాజు పాలించె. ఇతడు బ్రాహ్మణులచే వేదం పాడించి అందు తప్పొప్పులు యెంచి అవహేళన చేస్తూండె. ఇది ఆసరాగా తీసుకొని

నికృష్టులు,అహంకారులు అయిన ఇద్దరు బ్రాహ్మణ పండితులు వచ్చి,యవనరాజు మెప్పును,కానుకలును ఆశించి, వారితో ఇతర బ్రాహ్మణులచే వేదవాదం చేయించమని కోరె. బ్రాహ్మణులను బ్రాహ్మణులే కించ పరచుకోవటం యవనరాజుకు భలే వినోదమాయె. శిష్టాచారపరాయణులు అయిన బ్రాహ్మణులు, అహంకారం తలకెక్కిన అల్పుల యెదుట వేదం పాడుట అపచారం అని తలంచి, వీరికి ఒక దండం పెట్టి జయ పత్రాలు ఇచ్చి వేసె. అలా జయ పత్రాలు ప్రోగు చేసుకొంటూ కుపండితులు కుమసి గ్రామంన ఉన్న త్రివిక్రముని వద్దకు వచ్చి, వారితో వేదవాదం చేయమని లేదా జయపత్రం ఇమ్మని పట్టు పట్టె. సాటి బ్రాహ్మణులను అవహేళన చేస్తున్న ఈ తెలివి మాలిన పండితులకు బుద్ధి చెప్ప నా గురుదేవులే తగిన వారంటూ త్రివిక్రముడు వారిని శ్రీగురుని కడకు తోడ్కొని పోయె. అప్పుడు శ్రీగురుడు వారితో వేదం పూర్తిగా నేర్వడం బ్రహ్మాదులకే సాధ్యం కాలేదని, వేదం అనంతం ఆద్యంతరహితమని తెలిపి ఈ విషయం వెల్లడించె. పూర్వం భరద్వాజ మహర్షి వేదం పూర్తిగా అధ్యయనం చేయదలంచి, బ్రహ్మదేవుని వరంతో 3 బ్రహ్మదివశాల కాలం (432కోట్ల సం||లు x 3) వేదాధ్యయనం చేయుటకు సమయం చాలక చింత పడగా ఆది నారాయణుడే బాదరాయనుడిగా వేదాన్ని 4 భాగాలుగా విభజించి, నలుగురు శిష్యులకు పంచి, అధ్యయనం చేయమనె.

1. పైలుడు – ఋగ్వేదం ;ఉపవేదం – ఆయుర్వేదం; అధిపతి – బ్రహ్మదేవుడు
2. వైశంపాయనుడు - యజుర్వేదం; ఉపవేదం - ధనుర్వేదం; అధిపతి – రుద్రుడు
3. జైమిని - సామవేదం; ఉపవేదం – గంధర్వం; అధిపతి – విష్ణువు
4. సుమంతుడు – అధర్వణవేదం; ఉపవేదం – అస్త్రరూపం; అధిపతి – ఇంద్రుడు

దేవతలంతా మంత్రాలకు అధీనం అయితే మంత్రాలన్నీ బ్రాహ్మణుల అధీనం లో ఉండె. ఈ కలి కాలంలో వేదం అంతా పూర్తిగా నేర్వడం ఏ ఒక్కరికీ సాధ్యం కాదు అని శ్రీగురుడు ఆ దుష్ట పండితులను మందలించె. అయినప్పటికి వారికి బుద్ధి రాక, గురు శిష్యులలో ఎవరైనా వారితో వేదవాదం చేయమని, లేదా జయపత్రమిమ్మని వత్తిడి చేసె

అప్పుడు శ్రీగురుడు దారిని పోయే ఓ ఛండాలుడైన మాతంగుడిని పిలిచి, అతని పై కాస్త విభూతి చల్లి, ఆశీర్వదించి, పండితులతో వేదగానం చేయమనె. వెనుకటి జన్మలలో తానెవరో గుర్తు చేసుకుంటూ 7 జన్మలకు ముందు తాను వేదవిదుడైన బ్రాహ్మణుడనని చెప్పి, మాతంగుడు ఆ పండితులను వేద చర్చలో ఓడించె.

పండితులకు భయంతో నోటమాట రాక శ్రీగురుని శరణుజొచ్చె. తోటి బ్రాహ్మణులను దూషించి, అవమానించి, ధర్మోల్లంఘన చేసిన పాపమునకు 12 సం||లు బ్రహ్మరాక్షసత్వం అనుభవించి, ఒక బ్రాహ్మణునికి నారాయణానువాకం ఉపదేశించి, ఆ బ్రాహ్మణుడు అది పఠించగా వారు విని పాపవిముక్తులైరి.

7 జన్మల క్రిందట, వేద విదుడనైన తాను ఈ జన్మలో ఛండాలుడైనందుకు మాతంగుడు బాధపడి శ్రీగురుని వేడుకొన, వివిధ పాప కర్మల వలన ఎలాంటి అధోగతి కలుగుతుందో వివరించె.

తల్లిదండ్రులను, గురువులను, కులస్త్రీలను ఆగ్రహించి వదిలివేయడం,కులదైవం, సత్యం, అహింసా, ధర్మం విడచి, బ్రాహ్మణ ధూషణ చేసి, దైవార్పితం కాని ఆహారం తింటూ, పరులను దూషించే వారు ఛండాలులై జన్మించెదరని వివరించె. రక రకాల పాపాలకు తగిన శిక్షలు తెలిపె.


ఎంతటి పాపకర్మ అయిననూ పశ్చాతాపంతో సద్గురుసేవ చేయటం వలన తొలగి పోగలదని శ్రీగురుడు తెలియ జేసి, ఆ ఛండాలుని ఒంటిపై విభూతిని కడిగించి వేసె. అప్పుడు మాతంగుడు పూర్వ జన్మ జ్ఞానం మరచిపోయి, భార్యా బిడ్డలతో తన గూడెంనకు పోవ, త్రివిక్రమునికి శ్రీగురుడు విభూతి మహిమను వివరించి చెప్పె.

కృతయుగమున వామదేవుడనే ముని పుంగవుడు విభూతి పూసుకొని, నిరామయుడై అరణ్యమున సంచరించగా, ఓ బ్రహ్మరాక్షసుడు అతనిపై బడి తిన బోవ, ముని ఒంటిపై నున్న విభూతి రాక్షసుని పై పడి, ఆతని రాక్షసత్వం పోయి, విశేష జ్ఞానం కలిగి, పశ్చాత్తాపంతో ప్రార్థింప, వామదేవ మహర్షి ఆతనికి విభూతి మహిమను వివరించె.

ఒక పతిత బ్రాహ్మణుడు అవసాన దశలో ఉండగా బూడిదలో పడుకున్న కుక్క ఒకటి వచ్చి ఆతని వాసన చూడగా, దాని వంటి పైనున్న

బూడిద ఆ పతిత బ్రాహ్మణుని పై పడగా, శివదూతలు వచ్చి, యమకింకరులను తరిమి వేసి, విభూతి దారులకు కైలాస ప్రవేశమే అన్న శివుని ఆదేశం ను తెలిపి, బ్రాహ్మణుని కైలాసం గొని పోయేనని చెప్పి , వామదేవుడు బ్రహ్మరాక్షసుని పై విభూతి చల్లి ముక్తిని ప్రసాదించె.

భస్మం వలన జ్ఞానం కలుగునని, అది మహాత్ముల స్పర్శ తో బ్రహ్మజ్ఞానం కలిగించ గలదని, సాక్షాత్తు పరమ శివుడే ఇష్టంగా ధరించే ఈ భస్మం మహిమ ఎంతో గొప్పదని శ్రీగురుడు వివరించె.





గంధర్వపురంలో పేద బ్రాహ్మణుని ఇంట గొడ్డు బఱ్ఱెను పాడి గేదెగా దీవించిన శ్రీ గురుని లీల.



శ్రీ గురుని మహిమలు విని సాక్షాత్ పరమేశ్వరుడైన శ్రీ గురుడిని పల్లకిలో కూర్చుండచేసి నగరమునకు తోడ్కొని పోతున్న రాజు.



కుపండితులు దురహంకారంతో వేదవాదనలో
జయపత్రం ఇమ్మని త్రివిక్రముని కోరుతూ శ్రీగురుని కడకు
గజారోహనతో వచ్చుచున్న దృశ్యం.



వామదేవ మహర్షి బ్రహ్మరాక్షసునికి శివదేవునికి
ప్రీతికరమైన విభూతిమహిమను వివరించడం.

ఓం శ్రీగురవే నమః

# అధ్యాయం - 4

మాహూర పురంలో దత్త భక్తుడు-సద్బ్రాహ్మణుడు అయిన గోపీనాధునికి దత్తాత్రేయుని అనుగ్రహంతో లేకలేక పుట్టిన బిడ్డడికి దత్తాత్రేయుడు అని పేరు పెట్టుకొని, ముద్దుగా పెంచె. 12వ యేట రూపవతి, సుగుణవతి అయిన సావిత్రితో పెండ్లి చేసె. వారు అందం, ఆనందంతోడ ధర్మ పరమైన జీవనం సాగించుచుండ, కర్మవశాన దత్తునికి 16సం||లపుడే క్షయవ్యాధిసోకి శుష్కించ సాగె. సావిత్రి భర్త క్షేమమునకై ఎన్నో పూజలు,వ్రతాలు చేసి, తన నగలు యావత్తు వెచ్చించి, ఎన్నెన్నో మందులిప్పించినా దత్తునికి నయం కాక ఆమె దుఃఖ భారంతో చిక్కి శల్యమైపోయె.

ఒకనాడు ఏడుస్తున్న అత్తమామలను ఓదార్చి, సావిత్రి, దత్తున్ని గంధర్వపురమున కొలువైయున్న శ్రీగురుని వద్దకు గొనిపోవుటకు అనుమతించ మని వేడుకొని, వారి ఆశీర్వాదంను పొంది, తగిన ఏర్పాటుతో కొండంత ఆశతో, శ్రీగురుని కడకు చేరుకొనె. ఈ లోగానే దత్తుడు బాధతో గిలగిలలాడి మరణించె. ఆమె ఆశ అడియాస కాగా కన్నీరు- మున్నీరై విలపించ సాగె.

శ్రీగురుడే ఒక తపస్వి వేషంన అక్కడుకు వచ్చి సావిత్రికి తత్వబోధ చేసె. పూర్వం కాశీ క్షేత్రంలో అగస్త్యముని, అతని భార్య లోపాముద్ర నివశింప, వింధ్య పర్వతం వారికి గొడుగు వలె నిలిచి ఉండె.

ఒకనాడు నారదమహర్షి వచ్చి, వింధ్యా చలునితో నీవు మేరు పర్వతముతో సాటి కాచాలవు అని చెప్పగా వింధ్యా చలునికి రోషం హెచ్చి మేరువుని మించి పెరగ సాగె. వింధ్యకు దక్షిణ భాగం అంతా చీకటిమయం అవగా, సూర్య దర్శనం కానందున అక్కడ ప్రజల కర్మాచరణ తారుమారుకాగా, ఋషులందరూ ఇంద్రునికి మొరపెట్టుకోగా, బ్రహ్మదేవుని ఉపాయంతో ఇంద్రుడు దేవతలందరితో అగస్త్యమునిని దర్శించి, వారు దక్షిణ దేశానికి వెళ్ళేలా ప్రార్థించె. వారు అలా వెళ్తుండగా వింధ్యపర్వతం వంగి అగస్త్య దంపతులకు నమస్కరించగా, “నీవు ఇటులనే ఉండుము” అని

ఆదేశించె. అపుడు వింధ్యకు దక్షిణ ప్రాంతమంతయు సూర్య రశ్మి ప్రసరించి, దేవతలంతా సంతోషించి, దేవగురు బృహస్పతి మహాపతివ్రత అయిన లోపాముద్రను కీర్తించి,పతివ్రతా ధర్మాలు దేవతలకు వివరించె.

స్త్రీలకు పతియే పరమేశ్వరుడని భావించి, సేవించి, తరించాలని, పతి చనిపోయినపుడు సహగమనం చేయుటకాని, వైధవ్య ధర్మాన్ని అనుసరిస్తూ, దైవధ్యానంన బ్రతుకుట కాని ఉత్తమం అని వివరించెనంటూ, ఆ తపస్వి సావిత్రికి తెలిపె.


సావిత్రి పతితోడ సహగమనమే చేయ తలచితినంటూ, ఆ తపస్వికి నమస్కరించె. ఆ యోగీశ్వరుడు భస్మం కొంచెం శవం పైన చల్లి, రుద్రాక్షలతో అలంకరించమని సావిత్రికి 4 రుద్రాక్షలిచ్చి, శ్రీగురుని దర్శించమని ఆశీర్వదించి వెడలె.

ఆమె అటులనే చేసి, సహగమనంనకు అన్ని ఏర్పాట్లు చేసుకుని శ్రీగురు దర్శనార్థమై సంగమానికి వెళ్ళె. కరుణామయుడై వెలుగొందుతున్న శ్రీగురుని దర్శించి, సావిత్రి సాష్టాంగ నమస్సులొనర్చె. శ్రీగురుడు ఆమె పతిభక్తికి సంతసించి, “నిత్య సౌభాగ్యవతీ భవ” అని ఆశీర్వదించి, ఆమె భర్తను జీవితుని చేసె. అపుడు సావిత్రీ-దత్తులు సంగమంలో స్నానమాచరించి, శ్రీగురుని ఆనందముప్పొంగ పూజించె. సూర్యాస్తమ సమయం కావచ్చె, సావిత్రి-దత్తుల తోడ శ్రీగురుడు మఠము చేరె. మరునాడు శ్రీగురుడు వారికి రుద్రాక్ష మహిమను వివరించె.

రుద్రాక్షధారణ వల్ల పాపం నశియించి, 4 పురుషార్థాలు ప్రాప్తించ గలవని చెప్పి ఈ కథను తెలిపె. పూర్వం కాశ్మీర దేశంలో భద్రసేనుడనే రాజుకు తారకుడు, సుధర్ముడు అనే మంత్రికి సద్గుణుడు అనే కొడుకులు ఇద్దరూ ఎంతో సఖ్యంగా, రుద్రాక్షలు ధరించి శివారాధన చేస్తూండె. వారి వైఖరిని గూర్చి రాజు పరాశర మహర్షిని అడుగగా, ఆయన వారిద్దరూ పూర్వజన్మలో ఒక కోడి, కోతి అని తెలిపె. నందిగ్రామంలో ఉన్న మహా నంద అనే వేశ్య ధర్మపరాయణి అయి గుణసౌందర్యంతో భాషించుచూ, ఆమె ఇంట ఒక కోడి, కోతిని పెంచుతూ వాటిని సరదాగా రుద్రాక్షలతో అలంకరించుచుండె. ఆమె ధర్మాచరణను పరిక్షించగా విభవమునెల్ల విభూతిగా ఒడల ధరియించు జ్ఞాన తేజో విభుడు ఆ గిరిజా శంకరుడే గొప్పధనికుడైన వైశ్యునిగా వేషం కట్టి, నాగుపాములు నిగనిగల నగలవగా



సావిత్రి పతి భక్తికి మెచ్చి శ్రీగురుడు దత్తుడిని పునర్జీవితుని
చేయగా భక్తితో శ్రీగురునికి ప్రణమిల్లిన సావిత్రి దత్తులు.



కాశ్మీర దేశంలో రాజకుమారుడు, మంత్రికుమారుడు
శివ భక్తులై పూజలు చేస్తున్న దృశ్యం.

చేతులకు రత్నకంకణాలు చుట్టి, దేదీప్యమాన స్వయంప్రకాశమానమౌ తన ఆత్మలింగమే రత్నలింగంగా చేత పట్టి ఆ వేశ్య ఇంటను అడుగు పెట్టె. ఆ సమ్మోహనాకారుని వేశ్య ఆహ్వానించి, ఆ లింగం తనకు ఇచ్చి పెట్టమంటూ, అందుకు ప్రతిగా 3 రోజులు త్రికరణ శుద్ధిగా పాతివ్రత్యమౌలంభించి, అతనిని సేవించెదనంటూ సూర్య చంద్రుల సాక్షిగా ఆ లింగం పై ఒట్టుపెట్టె. తనకు ప్రాణసమానమైన ఆ శివలింగంకు ఎట్టి హాని కలిగినా తానింక లేనట్టె నంటూ అతడు ఆ లింగంను ఆమె చేత పెట్టె. కడు శ్రద్ధతో పూజించి, శివ లింగంను తన నాట్య మండపంన ప్రతిష్టించి, రాత్రి నిద్రించుటకు వారు శయనమండపంనకు పోగా, చిత్రంగా నాట్యమండపం రత్నలింగం, కోడి,కోతి లతో సహా భగ్గున మంటల మండె. ప్రొద్దుటే ఇది తెలిసి ఆ వైశ్యుడు, నా ప్రాణలింగమే పోయాక నేనింక బ్రతుకలేనంటూ అగ్ని రగిలించి అందు దుముకె. ఆ వేశ్యకూడా అతని వెన్నంటి వచ్చి పతివ్రతా ధర్మంను పాటించెదనంటూ ప్రమాణం చేసిన నాకు ఇదియే సరిసాటి అంటూ ఎందరు ఆమెను వారించినా వినకుండ చితిలో మండబోవంగ, వెంటనే నటనలు చాలించి నటరాజమూర్తి నిజరూపంన ముక్కంటిగ ఆమె ఎదుట నిలచి చిరునవ్వులొలుకుతూ ఆ వేశ్యను పట్టి ఆపి, నీ ధర్మ నిరతిని తిలకించ వైశ్యుని రూపంన వచ్చి, నా ఆత్మ లింగం నీకిచ్చి, నీ నాట్యశాలను మండించినది నేనేనంటూ పరమశివుడు ఆమెకు శాశ్వత శివ సాయుజ్యం వరముగా ఇచ్చె. ఆ నాడు నాట్య మండపాన, రుద్రాక్షలు ధరించి, అగ్నిలో పడి మరణించిన కోడి, కోతి పూర్వజన్మలో రుద్రాక్ష ధారణ పుణ్యం వలన ఈనాడు ఉత్తమ జన్మలు పొందినారని, అల్పాయుష్కులయిన వారిని పరాశర మహర్షి ఆశీర్వదించి, రుద్ర యాగ జపం తో పూర్ణాయుష్కులుగ చేసి దీవించె.

రుద్రాక్ష ధరించి , రుద్రజపం, రుద్రయాగం చేసిన ఎంతో పుణ్యప్రదమని, అందుకే శివునికి రుద్రాభిషేకం ప్రియమైనదని శ్రీగురుడు చెప్పె.

సావిత్రి శ్రీగురునికి నమస్కరించి, మిమ్ము నిరంతరము స్మరించేందుకు ఏదైనా మంత్రోపదేశం చేయమని వేడగా శ్రీగురుడు

"అమ్మా స్త్రీలకు పతిసేవయే మోక్షప్రదం" అని "స్త్రీలకు చేసిన మంత్రోపదేశం తో ఆ మంత్రం నిర్వీర్యమౌవును" అంటూ ఈ కథా రూపంన వివరించె.

పూర్వం, దేవాసుర యుద్ధం లో చనిపోయిన రాక్షషులను “మృత సంజీవనీ” మంత్రంతో రాక్షస గురువు శుక్రాచార్యుడు బ్రతికించుచుండ, ఆ మంత్రం నిర్వీర్యం చేయుటకు దేవతలు ఉపాయం చేసి, దేవగురువు – బృహస్పతి కొడుకు కచుని నియమించె.

కచుడు, శుక్రాచార్యుని కడ విద్య నేర్చుటకై వచ్చిన విప్ర కుమారుడనంటూ నమ్మించి కడు శ్రద్ధతో ఆతని సేవించె. రాక్షసులు, అతను శత్రు పక్షం వాడని గ్రహించి, గురువుకు చెప్ప సాహసించ లేక, కచుని చంపి బూడిదగా మార్చి, శుక్రునిచే త్రాగించె. శుక్రాచార్యుని కూతురు దేవయాని, కచుని మోహించి, ఆతని బ్రతికించ మంటూ, తండ్రిని ప్రార్థించె.

శుక్రుడు కూతురుపై ఉన్న ప్రేమవలన ఆ మంత్రం కూతురికి ఉపదేశించి, ఆ మంత్రంతోనే కచుని బ్రతికించి, తన కడుపు చీల్చుకుని కచుడు బయటకు రాగానే దేవయాని ఆ మంత్రం జపించి తండ్రిని జీవింప చేయంగా, తదుపరి మృతసంజీవని మంత్రం నిర్వీర్యమాయె. ఇది తెలిపి శ్రీగురుడు, సావిత్రితో స్త్రీలకు సర్వ సౌభాగ్యాలు ప్రసాదించే “సోమవారవ్రతం” చేయ మంటూ ఆనతిచ్చి, వ్రత మహత్యంను వివరంగా చెప్పె.

ఆర్యావర్తమున చిత్ర వర్మ అనే రాజుకు పార్వతీ పరమేశ్వరుల ఆశీర్వాదంతో కలిగిన కూతురికి సీమంతిని అని పేరు పెట్టుకుని ప్రేమగా పెంచె. ఆమెకు 14వ ఏటనే వైధవ్య గండముందని దైవజ్ఞులు సూచించ, తల్లిదండ్రులెంతో చింతించె. యజ్ఞవాల్క్య మహాముని భార్య మైత్రేయిని శరణు వేడంగా ఆ తల్లి సీమంతినితో సోమవారంనాడు శ్రద్ధగా ఆదిదంపతులైన శివ-పార్వతులకు భక్తితో పీఠం అర్పించి, పూలు, పసుపు- కుంకుమ, గంధమలంకరించి, పరమాన్న-పయసాలు నివేదించి తాంబూల-నీరాజనాలర్పించి సేవించ సకల సౌభాగ్యాలు చేకూరగలవంటూ ఆశీర్వదించె.

అప్పటి మొదలు సీమంతిని కడు శ్రద్ధతో సోమవారవ్రతమాచరించంగ, 12వ యేట ఇంద్రసేన మహీపాలుని రాకుమారుడు అయిన చంద్రాంగదునితో వివాహమాయె. ఓ నాడు రాకుమారుడు జలక్రీడలకై వెళ్ళి నీటమునిగి మరణించె.

సీమంతిని దీక్షతో చేయు సోమవరవ్రత పుణ్యాన పార్వతీపరమేశ్వరుల దయవలన నీట మునిగిన చంద్రాంగదుని నాగామృతంతో బ్రతికించి, అతని



మహానంద ధర్మనిరతిని పరీక్షించగా వైశ్యుని రూపంలో వచ్చిన శివదేవుడు.



సీమంతిని చేసిన సోమవారవ్రత మహిమతో తక్షకుడు చనిపోయిన చంద్రాంగదుని నాగామృతం తో బ్రతికించి సీమంతిని కోసం అమృతం ఇచ్చి పంపిన సీమంతిని సౌభాగ్యగాథ

భార్య కోసం ఒక పాత్ర నిండా అమృతం ఇచ్చి, నాగరాజు, చంద్రాంగదుని దివ్యాశ్వం ఎక్కించి,తిరిగి పంపించె. నాగామృత బలసంపన్నుడైన ఆతనిని చూసి శత్రువులు సైతం దాసోహమయ్యె. తదుపరి సీమంతినితో కలిసి చంద్రాంగదుడు చిరాయువును పొంది పట్టాభిషిక్తుడాయెనంటూ సీమంతిని సౌభాగ్యవిజయ గాధను శ్రీగురుడు వినిపించె.

సావిత్రి శ్రీగురునికి నమస్కరించి, సోమవారవ్రతమాచారిస్తూ, నిత్యసౌభాగ్యవతియై, భర్తతో కూడి సత్సంతానం పొందె.



## ఓం శ్రీగురవే నమః

# అధ్యాయం - 5

గంధర్వపురంలో నివసించే సత్యవంతుడైన పేదబ్రాహ్మణుడు భిక్షాన్నంతో తృప్తుడై వైదికకర్మలాచరిస్తూ, తనకున్నంతలోనే అతిథులను సేవించుచుండె. ఒక మహాలయ అమావాస్య నాట ఓ ధనికుడు బ్రాహ్మణసమారాధనకు దంపత సహితంగా ఆహ్వానించె. అతని భార్యకు అట్టి సమారాధనలకు వెళ్ళి, కట్నాలు, కానుకలు అందుకోవాలని ఆశగా ఉండటం చేత, భర్తకు ఇట్టివి ఇష్టం లేక పోయిననూ, శ్రీగురునిచే చెప్పించి, ఒప్పించి భర్తను తీసుకుపోగా , అక్కడ పవిత్రం మైన అన్నపు రాశిని కుక్క, పంది, నోటకరిచి అపవిత్రమైన దృశ్యం కంటపడె. బ్రాహ్మణుడు బాధపడి, భార్యను తీసుకుని శ్రీగురుని చెంతకు చేరగా, శ్రీగురుడు నవ్వి, ఓదార్చి, వారికి స్వధర్మాచరణను పూర్వం మునులకు పరాశర మహర్షి తెలిపినది చెప్పి, వారిని ధర్మోన్ముఖులను చేసె.

దైవానికి అర్పించి ఆహారం స్వీకరించ వలెనని, తల్లిదండ్రుల, గురువుల, పెద్దల యెడ పూజ్యభావం ఉన్న వారి ఇంట భోజనం చేయవచ్చని, పెద్దలను చూసినప్పుడు నమస్కరించ వలెనని, గురుదేవుని కుడిపాదం ను కుడిచేతితోను, ఎడమపాదంను ఎడమచేతితోను, స్పృశించి సాష్టాంగ నమస్కారం చేయవలెనని, భోజనంనకు వచ్చిన అతిథులను పరమేశ్వరస్వరూపంగా భావించి భిక్ష ఇవ్వవలెనని చెప్పి, ఆశబోతులు, దురాచారులు, భగవంతుని పట్ల భక్తిలేని వారు, డాంభికులు, స్వార్థపరులు, కరుణలేని వారి ఇంట పెట్టిన ఆహారం స్వీకరించరాదని మొదలైన విషయాలతో స్వధర్మానుష్ఠానం ను శ్రీగురుడు వివరించె.

ఇటుల శ్రీగురుడు గంధర్వపురం న కొలువై భక్తుల, దీనుల, ఆర్తుల, శరణాగతులకెందరికో కరుణ పంచి ఆదరించంగ ఎందరెందరో అటకు వచ్చి శ్రీగురునికి ఇష్టమైన బ్రాహ్మణ సంతర్పణలు చేయుచుండె.

కాశ్యపసగోత్రీకుడు భాస్కరశర్మ అనే పేద బ్రాహ్మణుడు కూడా సమారాధన చేయ దలంచి, త్రిమూర్తిస్వరూపంగా తనవద్దనున్న ముగ్గురికి మాత్రమే సరిపడే ధాన్యం, సరుకులు మూట కట్టుకొని తెచ్చె. అక్కడ సంపన్న

బ్రాహ్మణులు చేయు నిండైన సంతర్పణలు చూసి, ఏమి చేయవలనో పాలుపోక, మనస్సున శ్రీగురుని స్మరిస్తూ, భాస్కర శర్మ మూడు మాసాలు అటులనే గడిపె. ఇది చూసి, కొందరు బ్రాహ్మణులు "భిక్ష ఇచ్చుటకై ఇక్కడకు వచ్చి తిష్ట వేసుకొని సుష్టి గా తింటున్న నీకు సిగ్గు-ఎగ్గూ లేకుండెనే" అంటున్న నిష్ఠూరాలు, పేదల పెన్నిధి అయిన శ్రీగురునికి చేరె.

ఆయన భాస్కరుని పిలిచి "నాయనా, రేపు నీ చేతి అన్నం మాకు ప్రసన్నము" అంటూ ఆనతిచ్చె. భాస్కరశర్మ యెంతో ఆనందించి ఆ రోజు తెల్లవారుఝామునే నిద్రలేచి, స్నానసుష్ఠానాలు ముగించుకొని, పాలు, పెరుగు, నెయ్యి కూర్చుకొని తాను తెచ్చిన సరుకులతో వంట పూర్తి కావించి, శ్రీగురునికి విన్నవించె.

శ్రీగురుడు "నాయనా మాకు బ్రాహ్మణులందరితో సహ పంక్తి భోజనమే సమ్మతము కనుక నగరమున ఉన్న బ్రాహ్మణులందరిని మా మాటగా చెప్పి, భోజనంనకు తీసుకురా" అని ఆదేశించ, అడుగడుగునా తనను అవహేళన చేస్తున్న బ్రాహ్మణులను గురుని మాటగా చెప్పి భాస్కరశర్మ సహపంక్తికి తోడ్కొని వచ్చె.

శ్రీగురుడు భాస్కరశర్మకు తన దివ్య వస్త్ర మొకటి ఇచ్చి, వంటకాలపై కప్పి, వస్త్రము తీయకుండా, వస్త్రం క్రింద నుంచి వడ్డించ మంటూ ఆశీర్వదించె. అటుల వడ్డన చేయంగా పదార్థాలు అక్షయమాయె, శ్రీగురుడు అన్నపూర్ణేశ్వరుడు  అని కీర్తిప్రకాశం వెల్లువలాయె. పురమునందు ఉన్న బ్రాహ్మణులందరూ, శ్రీగురుని కరుణామృత ప్రసాదం కడుపునిండ భుజియించి, శ్రీగురుని అనుగ్రహానికి పాత్రులైన వారికి ఎట్టి కొరతలు ఉండవంటూ భాస్కరశర్మను అభినందించగా , భాస్కరుడు శ్రీగురుని ఆనంద భాష్పాల నమస్కరించె. శ్రీగురుడు ఆశీర్వదించి, భాస్కరశర్మను ఇంటికి పంపి వేసె.



భాస్కరశర్మ ముగ్గురికి సరిపడే సరుకులతో శ్రీగురుని
దయతో వేల మందికి సంతర్పణ చేస్తున్న దృశ్యం .



సత్యవంతులైన బ్రాహ్మణదంపతులకు స్వధర్మాచరణను
వివరించి చెప్తున్న శ్రీగురుడు.

ఓం శ్రీగురవే నమః

# అధ్యాయం - 6

గంధర్వపురమున శౌనక గోత్రమునకు చెందిన సదా చార బ్రాహ్మణ దంపతులైన సోమనాధుడు గంగాంబ అనే, వృద్ధ దంపతులకు 60సం|| నిండినా సంతతి లేక చింతించి, నిత్యం అశ్వత్థ వృక్షం క్రింద కొలువైన శ్రీగురుని దర్శించి, సేవించె.

శ్రీగురుడు ఆమె దీక్షకు మెచ్చి, అశ్వత్థవృక్షంలో కొలువున్న సకల దేవతా స్వరూపమైన శ్రీగురుని నిత్యం పూజించమంటూ అశ్వత్థ వృక్షం యొక్క ప్రాశస్త్యమును వివరించె. అశ్వత్థ పూజలో శని దోషము తొలగి, అభీష్ట సిద్ధికి ఈ మంత్రమెంతో ఫలమీయగలదని శ్రీగురుడు తెలిపె.

కోణస్థః పింగళో బభ్రుః
కృష్ణో రౌద్రాంతకో యమః
శౌరిశ్శనైశ్వరో మందః
పిప్పలా దేవ సంస్తుతః

అశ్వత్థవృక్షం ప్రణవ స్వరూపం అని, అశ్వత్థ ప్రదక్షిణం, పూజ ఎంతో పుణ్యప్రదమని అశ్వత్థవృక్షంలో దేవతలతో కలసి నారాయణుడు కొలువుంటాడని, అందుకే పురాణాలు 'అశ్వత్థ నారాయణుడు' అని అశ్వత్థ వృక్షాన్ని కీర్తించాయిని చెప్పె. గంగాంబ చేసిన పూజా ఫలంగా ఆమెకు ఒక కూతురిని, ఒక కొడుకుని ప్రసాదించగా వారికి సరస్వతి, నృసింహా అని శ్రీగురుని పేర్లు పెట్టుకొనె. జుట్టు అంతా నెరిసిపోయి, పల్లన్నీ పట్టు తప్పివున్న ఆ వృద్ధ దంపతులు చరమ దశలో శ్రీగురుని వరం తో బిడ్డలను పొంది బ్రతుకు ధన్యమై జీవితాంతం అశ్వత్థ సహిత శ్రీగురుని ధ్యానించి కృతార్థులయ్యె.

ఒకనాడు గంధర్వ పురంనకు గార్గ్యగోత్రమునకు చెందిన నరహరి శర్మ అనే కుష్ఠురోగి వచ్చి, శ్రీగురునికి నమస్కరించి , తనకు గల ఈ తెల్లకుష్ఠు వ్యాధిని తొలగించగల పరమాత్మ స్వరూపులు తమరని నమ్మి వచ్చితినని కన్నీరొలికించె. పాపాల శాపమే రోగాల కీలం అంటూ, నరహరిని కరుణించి శ్రీగురుడు ఒక ఎండిన మేడు కొమ్మను ఇచ్చి సంగమం వద్ద నాటి, నిత్యం సంగమంలో స్నానం చేసి, అశ్వత్థ ప్రదక్షణం చేసి రోజూ 3 పూటలా 2

చేతులతో నీరు తెచ్చి పోయమని, మేడుకట్టె చిగురించే నాటికి వ్యాధి పోగలదని చెప్పె.

శ్రీగురుడు చెప్పిన పని నరహరి చేయు చుండ పలువురు ఫక్కున నవ్వి, **'ఆ మేడు కట్టెకు మొలక రాదు, నీ తెల్ల కుష్టుకు తెరిపి లేదు.'**

అని నిరుత్సాహ పరచినా, గురువాక్యం పై నమ్మకముంచి, నరహరి శర్మ దీక్షగా ఆచరించె. శ్రీగురుడు ఇది గ్రహించి, నరహరి శర్మను విమర్శ చేయు జనుల చూసి, **'ఈ భూలోకంలో గురువాక్యమొక్కటే తరింప చేయగలదని,'** దేవత, మంత్రం, వైద్యుడు,పుణ్యతీర్థం, గురువు – వీటి పట్ల ఎవరి భావం ఎలా ఉండునో వారి ప్రాప్తం అలాగే ఉండునని ఈ కథా రూపంన వినిపించె.

పాంచాల దేశాన్ని పరిపాలించు సింహకేతువు అనే రాజుకి ధనుంజయుడు అనే పేరుగల ధార్మికుడయన కుమారుడుండె. ఒకనాడు రాకుమారుడు వేటకై వెడలె. వేటలో అలసి, దప్పికతో ఉండగా శబరుడు అనే బోయవాడు, రాకుమారుని కొక కొలను చూపించి, దాహం తీర్చె. ప్రక్కనే ఉన్న శివాలయమున రాకుమారుడు విశ్రాంతి తీసుకొనగా, అందు ఓ మూలనున్న శివలింగంను బోయవాడు తీసుకొని, ఎప్పటినుంచో తనకు శివపూజ చేయు తలంపు కలదనీ, తమరు నాకు గురుదేవులై శివపూజా విధానం తెలుపుమని రాకుమారుని ప్రార్థించె. అప్పుడు ధనుంజయుడు, శివలింగంను ఇంట్లో ఈశాన్యమూలంన శుభ్రం చేసి, స్థాపన చేసి, రోజూ చితాభస్మం తెచ్చి, అభిషేకించి, తినబోయే ఆహారంను ముందుగా శివలింగంనకు నివేదించమని చెప్పె.

అంతట బోయవాడు సంతోషంగా ఇంటికి వెళ్ళి ప్రతిరోజూ అటులనే శివపూజ చేసె. ఓ నాడు ఎంత వెతకిననూ చితా భస్మం దొరకక చింతించగా అతని భార్య, తమ ఇంట ఉన్న కట్టెలతో తనను తగుల బెట్టి, ఆ భస్మంతో పూజ చేయమని, గురువు చెప్పిన మాటకు, శివపూజకు విఘ్నం కలిగించరాదని, భర్తను ప్రార్థించి, ఒప్పించగా, అతడు అటులనే ఒనరించి, శివపూజ శ్రద్ధగా ముగించి, పారవశ్యంన మైమరచి, ఎప్పటివలే ప్రసాదం భుజియించ భార్యను పిలిచె. వెనుకటి వలే అతని భార్య కూడా ఆనందంగా వచ్చి చేరె. అంత శివుని మహిమ గని అబ్బుర పడగా ఆ పుణ్య దంపతులకు శివ సాక్షాత్కారం కలిగి స్వర్గవాసము ప్రాప్తించె. విశ్వాసముంచి చేయు గురువాక్య పరిపాలన ఎంతటి

సత్ ఫలితం ఈయగలదో శ్రీగురుడు తెలిపి, నరహరి శర్మ భక్తి, శ్రద్ధలు చూసి మనసున ఆనందించి, శ్రీగురుడు కరుణావీక్షణం తో తమ కమండలం లోని నీరు మేడు కట్టె పై చిలుకరించె.

ఆ ఎండు మేడు చిరుపల్లవముల చిన్న మేడు చెట్టాయె. నరహరికి కుష్ఠు రోగం కుదిరి కాయం బంగారు రంగుల వెలిగి పోయె.

నరహరిశర్మ ఆనందముప్పొంగ కన్నీటితో శ్రీగురుని పాదాలపడి భక్తితో శ్రీగురుని కీర్తించి నరసింహ సరస్వతీశుని అష్ఠకమ్ పాడె. భక్త లోలుడైన గురుదేవుడు అతనికి అభయమిచ్చి, "జ్ఞాన రాశి వవుదువుగాక " అని ఆశీర్వాదమిచ్చి, నీ వంశమున జన్మించిన వారంతా వేద శాస్త్రజ్ఞులు, శతాయుష్మంతులు కాగలరంటూ వరములిచ్చి, అష్టాంగయోగం-విద్యాసరస్వతీ మంత్రం ఉపదేశమిచ్చి, యోగీశ్వరుడు అన్న బిరుదునిచ్చి నరహరిశర్మను తమ సన్నిధిలోనే ఉండమని దీవించె.

పూర్వం శ్రీగురుడు గోదావరీ తీరాన వాసర బ్రహ్మేశ్వర క్షేత్రానికి వచ్చినపుడు యవనరాజు కొలువులో ఉన్న తనను రక్షించమని ప్రార్థించి, శ్రీగురుని వాత్సల్యాన్ని చవిచూసిన సాయందేవుడు గంధర్వ పురం వచ్చి శ్రీగురుని స్తుతిస్తూ ఆయన పాదాల వ్రాలె.

శ్రీగురుడు ప్రేమగా సాయందేవుని తల నిమిరి "నీ వంశమున గురు భక్తి స్థిరమౌతుంది" అంటూ ఆశీస్సులిచ్చె.

కొంత కాలం పిదప సాయందేవుని గురుభక్తిని పరీక్షించదలచి శ్రీగురుడు ఒక లీల జరిపించె. ఒకనాడు సాయంత్రం మిగతా శిష్యులను రావద్దని చెప్పి శ్రీగురుడు సాయందేవుని తీసుకుని, సంగమానికి వెళ్ళి, అక్కడ అశ్వత్థవృక్షం క్రింద కూర్చుని ధ్యానంన లీనమాయె. అంతలో అకస్మాత్తుగా పెనుగాలి వీచి, ఉరుములు-మెరుపులతో కుంభవృష్టి కురిసె. ఇలా అర్ధరాత్రి 2వ ఝాము వరకు కొనసాగగా, శ్రీగురుడు, సాయందేవునితో తనకు చలి బాధ దుర్భరంగా ఉందని, మఠంనకు పోయి అగ్నిని తెమ్మని పంపుతూ బాటకు ఇరు ప్రక్కలకు చూడకుండా త్వరగా రమ్మని పురమాయించె.

సాయందేవుడు గంధర్వపురం వైపుగా పరుగులిడి పోవుచుండ, దారిలో మోకాళ్లు లోతుల బురదలో కాలు కూరుకుని పోగా, రొమ్ము లోతున వరద నీరు ప్రవహించ రాగా, కారు చీకట్లు కమ్మి త్రోవ కానలేక, విసరి వేస్తున్న ఈదురు గాలికి ముందుకు పోలేక యాతన పడుతూ గురు స్మరణ చేస్తూ,

ఎలాగో మఠం చేరుకుని, నిప్పు తీసుకుని తిరిగి వస్తూ, శ్రీగురుడు తనను బాటకు ఇరు ప్రక్కలా ఎందుకు చూడవద్దన్నారని కుతూహలం మితిమీరి ప్రక్కలకు చూచె. రెండు వైపులా 5 తలల పెద్ద త్రాచు పాములు అతనితో పాటుగా వేగముగా రాగా, సాయందేవునికి గుండెదడ హెచ్చి శ్రీగురుని ప్రార్థించ, భయం తగ్గి, బాటచిక్కె. సంగమం చేరి, అగ్ని రగిలించి, దివ్యప్రకాశమాన శోభితుడైన శ్రీగురుని చూడగా, ఆ రెండు పాములు శ్రీగురునికి నమస్కరిస్తూ వెడలె.

అప్పుడు శ్రీగురుడు "నీకు తోడుగా ఆ పాములను మేమే పంపాం" అని సాయందేవుని చూసి చిరునవ్వులొలికిస్తూ, గురుసేవ ఎంత కఠినమైనదో చూశావా, తగిన భక్తి విశ్వాసాలుంటేనే అందుకు పూనుకోవాలి అని తెలిపి, గురుభక్తిని గురించి, పార్వతీదేవికి పరమేశ్వరుడు చెప్పిన గురు తత్వంను సాయందేవునికి విశదీకరిస్తూ గురువే ఈశ్వరుడు అని దృఢమైన విశ్వాసం తో సేవించిన వారికి సర్వ సిద్ధులు కలుగుతాయని తెలిపే త్వష్ట బ్రహ్మ కథను వినిపించె.

పూర్వం త్వష్ట అనే 8 సం||ల బాలుడు ఉపనయనం తదుపరి వేదాధ్యయనంకై గురువు వద్దకు చేరె. ఒక వర్షాకాలంలో వచ్చిన వరదనీటికి గురువరుని కుటీరం శిధిలమాయె. అప్పుడు గురువు త్వష్టను పిలిచి "నాయనా ఎట్టి ఒడిదుడుకులకు చెక్కుచెదరక స్థిరం గా నిలచి ఉండే (గురుభక్తి అనెడి) కుటీరం కావాలని",

గురుపత్ని "ఎవ్వరూ నేయనిదీ, కుట్టనిదీ, సరిపోయే రంగురంగులది (నామరూపాత్మకమైన ఈ విశ్వం – చిత్రవిచిత్రమైన జగన్మాత స్వరూపం అనే దృఢమైన ఇంద్రియ నిగ్రహం అనెడి) రవిక కావాలని"

గురుపుత్రుడు "అన్నా మట్టి అంటకుండా నడిపించేవి, నీటిపైకూడా నడవగలిగి ఎప్పుడూ సరిపోయే (యమ నియామాలతో నిగ్రహించబడి, గురుధ్యానంన ఎల్లప్పుడు స్థిరంగా లీనమయ్యే నిశ్చల మనస్సు అనెడి) పాదరక్షలు కావాలని"

గురుపుత్రిక "అన్నా నా చెవులకు కుండలాలు, ఆడుకోడానికి అన్ని వసతులుండి, ఒంటిస్తంభంతో, దంతంతో చేయబడి, పగలకుండా ఉండి, ఎక్కడికైనా తీసుకు పోగలిగే వీలుగా చక్రాలు ఉండి, వంట సామగ్రి కలిగి నాకు వంట నేర్పించి, అందు చేసిన వంట ఎప్పటికైనా వేడిగా , రుచికరంగా,



గంగాంబకు అశ్వత్థ మహిమను వినిపిస్తున్న శ్రీ గురుడు.



నరహరిశర్మ భక్తి శ్రద్ధలకు శ్రీగురుని కరుణతో చిగురించిన మేడు కట్టె.



త్వష్ట బ్రహ్మ గురుభక్తిని సాయందేవునికి వివరిస్తున్న
శ్రీగురుడు.



అనంతపద్మనాభవ్రతం చేసి అనంతుని కృపతో
పునర్వసు నక్షత్రమై వెలిగిన సుశీలాకౌండిన్యులు.

ఉండేలా మట్టితో చేసిన మంచి వంట పాత్రలు కలిగి వీటన్నిటితో కూడిన (అవయవ ధాతుమయమైన ఈ దేహంతో అన్నీ నేర్చుకుని, పరోపకారార్థం వినియోగించి, మంచి – చెడు వివేచన చేసి గురు సన్నిధానంనకు తీసుకు పోగలిగే పరిశుద్ధమైన ఈ శరీర శకటం అనేడి) బొమ్మరిల్లు కావాలని ” కోరగా, ఆ బాలుడు గురుదేవునే మనస్సున ధ్యానించి, గురు కరుణతో కాశీకి చేరి, గురుభక్తితో కాశీ విశ్వేశ్వరుని మెప్పించి, కోరిన వన్నీ సృష్టించే 'విశ్వకర్మ' అనే సృష్టికర్తగా వరములు గ్రహించి, గురువరుడు అడిగినవన్నీ సమర్పించి, గురు భక్తునికి సాధ్యం కానిది ఏది లేదని నిరూపించె.

శ్రీగురుడు సాయందేవునికి గురుసేవా ప్రాశస్త్యం వివరిస్తూ త్వష్ట బ్రహ్మ చేసిన కాశీ యాత్రను వినిపించగా సాయందేవునికి కాశీ యాత్ర దర్శనం కాగా, పరవశమ్మున “ శ్రీగురుడు నివసించిన చోటే కాశీ ” అని శ్రీగురుని స్తోత్రం చేసె. శ్రీగురుడు ఆనందించి “నీ వంశమున 21 తరాల వారికి కాశీ యాత్రా ఫలం సిద్ధించింది” అని దీవించె.

సాయందేవుడు తన భార్యాబిడ్డలను తీసుకుని, సంగమమున స్నానం చేసి, అశ్వత్థమును పూజించి, శ్రీగురునికి నమస్కరించగా, శ్రీగురుడు వారినందరినీ దీవించి, ఆనాడు అనంత పద్మనాభ చతుర్దశి కనుక వారి గోత్ర ఋషి అయిన కౌండిన్యుడు చేసిన అనంత పద్మనాభ వ్రతం చేసుకోమని ఆనతినిచ్చె. సర్వాంతర్యామిగా, అనంతుడుగా ఉన్న శ్రీకృష్ణుని నిష్ఠగా పూజించి, ఈ వ్రతం చేయగా కష్టాలు తీరి, అభీష్టాలు నెరవేరగలవని, పాండు పుత్రుడైన ధర్మ రాజుకు సాక్షాత్‌గా శ్రీకృష్ణుడే ఈ వ్రతం చేసుకొమ్మని, వ్రతవిధానం, వైశిష్ట్యంను వివరించెనని చెప్పె.

పూర్వం కృతయుగంలో వశిష్ఠ గోత్రానికి చెందిన సుమంతుడు-దీక్షాదేవి అనే దంపతులకు సుశీల అనే కుమార్తె కలుగగా కొద్ది కాలంనకే సుమంతుని భార్య దీక్షాదేవి మరణించగా, అతడు తన కర్మానుష్ఠానానికి భంగం రాకుండా మరలా వివాహం చేసుకోగా సవతి తల్లి సుశీలను బాధించ సాగె. అపుడు సుమంతుడు కూతురైన సుశీలను వేదశాస్త్ర పారంగతుడైన కౌండిన్యునికిచ్చి వివాహం చేసి, వారిని వేరు కాపురంనకు పంపించి వేసె.

సుశీల - కౌండిన్యులు అలా సాగిపోతూ ఒక భాద్రపద శుక్ల చతుర్థి నాటి మధ్యాహ్ననికి ఒక ఏటి వద్ద ఆగి కౌండిన్యుడు స్నాన సంధ్యాదులు ముగించుకోగా తదనంతరం సుశీల స్నానం చేస్తూ, అక్కడ కొందరు స్త్రీలు

ఎర్రని చీరలు కట్టుకుని కలశ పూజలు చేయుచుండగా చూసి అది ఏమని అడుగగా తాము అనంత వ్రతం చేస్తున్నామని చెప్పి ఒక ముత్తైదువ వివరాలు ఇటుల విడమరిచె. ప్రతీ భాద్రపద శుక్ల చతుర్థి నాడు పద్నాలుగు ముడుల ఎర్రని తోరం సిద్దంచేసుకుని ప్రవహించే నీటిలో స్నానం చేసి ఎర్ర కోక కట్టి ఆకులతో కలశం చేసి క్రొత్త వస్త్రముపై గంధంతో అష్ట దళ పద్మం వేసి దర్భలతో చేసిన సర్పాకృతినుంచి శేషసాయి అయిన చతుర్భుజుని ఆ శ్రీకృష్ణుని ద్వాదశాక్షరి మంత్రం లేదా పురుష సూక్తంతో ధ్యానించి పూజించవలెనని కుడి చేతికి తోరం కట్టుకుని పాత తోరం విడిచిపెట్టవలెనని తదుపరి గోధుమ పిండితో నైవేద్యం చేసి దక్షిణ తో సహా వేద విప్రునికి దానమిచ్చి శక్తి కొద్దీ బ్రాహ్మణులకు భోజనం పెట్టవలెనని తెలియ జేసె. ఇటుల 14 సం||లు, 14 కుండలు దానమివ్వగా అనంతుని కృప తో సకల కామితములు నెరవేరగలవని చెప్పి మంగళకరమైన ఈ అనంత వ్రతం సుశీల చేత కూడా ఆ సువాసినులు చేయించె. అనంతరం సుశీల-కౌండిన్యులు ఒక పట్టణమునకు చేరగా ఆ పురపౌరులు ఎదురొచ్చి ఈ దంపతులను అక్కడనే ఉండమని ప్రార్ధించి వసతులు అన్నీ సమకూర్చె. వ్రత మహిమ వలన వారు సంపన్నులై సుఖించుచుండ ఒక నాడు కౌండిన్యుడు సుశీల చేతికి ఉన్న తోరం చూచి “ఇది ఏమి మాయా దారం, వశీకరణ మారి వలె ఉన్న”దంటూ , ఆమె ఎంత వారించినా వినకుండా దానిని త్రెంచి మంటలో వేసె. దీని పర్యవసానంగా సంపద యావత్తూ దొంగల పాలయ్యె. కౌండిన్యుడు తన తప్పిదంనకు పశ్చాత్తాపంతో “అనంతుని దర్శించి క్షమ వేడెద”నంటూ ఉన్న పళంగా ‘అనంతా-అనంతా’ అని కేకలు వేయుచూ అరణ్యమునకు పోగా మార్గములో వింత శైలిలో జీవనం సాగించు జీవులను గని ‘అనంతుడు ఎక్కడ’ అని అడుగగా అవి ‘మేము కూడా అనంతుని కొరకే కాచుకుని ఉన్నాం. నీకు ఆయన కనపడితే మా దయనీయ స్థితిని వినిపించవలయు’ నని విన్నవించె.

కౌండిన్యుడు అనంతుడి కొరకై వెతికి వెతికి వేశారిపోగా అనంతుడే ఓ వృద్ధుని రూపమున వచ్చి కౌండిన్యునికి అందమైన పురంలో సుందరరూపుడైన అనంతపద్మనాభుని చూపించె. కౌండిన్యుడు ఆనందపరవశమొంది స్తుతించగా అనంతుడు సంప్రీతుడయ్యె. అప్పుడు కౌండిన్యుడు తాను కాన లో చూసిన జాలి బ్రతుకులను గూర్చి ఆయనకు నివేదించగా అంతుడిలా చెప్ప దొడంగె.

1. ఒక విప్రుడు విద్వాంశుడై కూడా యెవ్వరికీ విద్య నేర్పక ఎల్లపుడూ శాస్త్ర వాదనలో పాల్గొని విద్వత్తును వ్యర్ధం చేసినందున ఈ అరణ్యమున కాయ కాయని గొడ్డు మామిడి చెట్టాయె.
2. ఒకరు చవిటి నేలను దానమిచ్చి మేతమేయని పశువు-దూడలాయె.
3. శ్రీమంతుడయినను ఇసుమంతైనా దానం ఈయనందున ఆబోతగానయ్యె.
4. ఒకరికొకరు దానమిచ్చి పుచ్చుకున్న అక్కా-చెల్లెళ్ళు చుక్క నీరయినా ఇచ్చి చిన్ని పక్షికి కూడా దాహంతీర్చలేని వ్యర్ధమైన చెరువులై ఒకదానిలోనికొకటి ప్రవహించె.
5. అర్ధం లేని క్రోధం తో ఒకడు గాడిదగా మారె.
6. ఉచ్చనీచములు లేక మదించి విచ్చలవిడిగా సంచరించిన వాడు ఏనుగాయె.

ఇవన్నీ వాటి దుస్థితిని ఎరింగి నాకు వివరించమంటూ నిన్ను కోరినందున వాటికన్నింటికీ ముక్తిని ప్రసాదించెదనంటూ కౌండిన్యుని జూసి "నా కొరకు ఇంత పరితపించిన నీ కీర్తి అమరమై దివిలో పునర్వసు నక్షత్రమై మెరియగలద" ని వరములిచ్చె. ఇహలోకంలో సుశీల - కౌండిన్యులకు అన్నీ పురుషార్థాలు సిద్ధించి, శ్రీమంతులై జీవించి, పరంలో నిత్యమైన వైకుంఠ వాసమును పొంది కౌండిన్యుడు పునర్వసు నక్షత్రమై శాశ్వతంగా ఆకాశంన వెలిగె. శ్రీగురుడు ఆనతిచ్చిన ఈ వ్రతమాచరించి, సాయందేవుడు, వారి వంశమందున నాగనాధుడు, గంగాధరుడు మొదలైన వారు కులదీపకులై వెలుగులీన, వీరి వంశమందునే జన్మించిన సిద్ధ సరస్వతి శ్రీగురునికి ప్రత్యక్ష శిష్యుడై, సిద్ధ యోగీంద్రుడై, కలిమలమునకు చిక్కి కారు చీకటిలో కొట్టు మిట్టాడు అభాగతులను కరుణించి దారి చూపే జ్ఞాన సూర్యుడై కాంతులు వెదజల్లె.

## ఓం శ్రీగురవే నమః

# అధ్యాయం - 7

శ్రీగురుని సేవకులలో తంతుకుడు అనే సాలెవాడు ఒకడు నిత్యం మఠానికి వచ్చి, ముంగిలి ఊడ్చి, నీళ్ళు చల్లి, రంగవల్లులు తీర్చి, శ్రీగురునికి సాష్టాంగ నమస్కారముల తో సేవ లొనరించె. ఒక శివ రాత్రి నాటికి అతని బంధువులందరు శ్రీశైల యాత్రకై పోవ, తంతుకుడు మాత్రం శ్రీగురుని విడచి ఎక్కడకూ రానని,ఆనాడు ఎప్పటి వలె మఠమునకు చేరి, నిత్య సేవలు చేసి సంగమమున స్నానమాడి, పరంజ్యోతి స్వరూపులైన శ్రీగురునికి నమస్కరించె.

కడు శ్రద్ధతో అతడొనరించు సేవలకు శ్రీగురుడు ప్రీతి చెంది ప్రేమతో తంతుకుని తన దగ్గరకు పిలిచి "నాయనా ఈ పుణ్యతిథి నాడు శ్రీశైల క్షేత్ర దర్శనం నీకు కలిగించెద, మా పాదుకలు గట్టిగా పట్టుకుని కన్నులు మూసుకో" మని తెలిపి, యోగమార్గంన క్షణకాలంలో తంతుకుని, శ్రీశైలమున పాతాళ గంగ ఒడ్డుకు చేర్చె. క్షౌరం, స్నానం చేసుకొని, మల్లిఖార్జునిని దర్శించి రమ్మని పంపించె. తంతుకుడు శ్రీగురుని మహిమకు సంబర పడుతూ ఆనందంగా మల్లిఖార్జుని దర్శించ పోగా అతని బంధువులు ఎదురేగి, 'శ్రీగురుని ఎన్నడూ విడువలేని నీవు శ్రీశైలమెలా వచ్చినావు' అని పరిహాసం చేసె. తంతుకుడు వారి మాటలు పట్టించుకోక, శ్రీగురుని స్తుతిస్తూ, పువ్వులు, బిల్వ దళాలు పట్టుకుని లింగార్చనకు పోగా, అక్కడ మల్లిఖార్జుని స్థానంన శ్రీగురుడు దర్శనమిచ్చి, భక్తులు ఒనరించు పూజలను స్వీకరించుచుండె.

తంతుకుడు సంతోషముతోడ పూజ పూర్తి కావించి, పరుగులిడి పాతాలగంగ చేరి, శ్రీగురునికి సాష్టాంగం చేసి, "స్వామి తమరు సాక్షాత్ పరమేశ్వరులే అని నమ్ముకుని తమ పాదాలు వద్ద పడి ఉన్న నన్ను ఇంత దూరమేల తోడుకొచ్చారు? ఇక్కడ మల్లిఖార్జుని లింగంలో తమరే నాకు దర్శనం ఇచ్చారు " అని ఉద్వేగంతో తెలిపె.

అప్పుడు శ్రీగురుడు వాత్సల్యంతో " నాయనా మహాశివరాత్రి పర్వ దినాన శ్రీశైలక్షేత్రాన గల స్థలమహిమను నీకు వివరించెద " నంటూ ఈ కథను వినిపించె.

ఈనాటి టిప్రా ప్రాంతంలో ఉన్న కిరాతదేశాన్ని పూర్వం విమర్షణుడు అనే రాజు పాలించుచుండ, అతడెంతో బుద్ధిమంతుడు, పరాక్రముడు ఈశ్వర భక్తుడై ఉండి కూడా, యుక్తా యుక్త విచక్షణ లేకుండా పరస్త్రీలంపటుడిగా ఉన్న అతనిని చూసి, గుణవంతురాలు, పతివ్రత అయిన అతని భార్య కుముద్వతి సందేహపడి భర్తను అడుగగా, రాజు తన పూర్వ వృత్తాంతమంతయు ఇటులు తెలిపె..... వెనకటి జన్మమందు అతడు ఒక గొల్లవాని వాకిట్లో కుక్కగా జీవించగా, ఒక మహా శివరాత్రి పర్వదినమున తన యజమానితో పాటుగా ఉపవాసముండి, శివాలయమునకు వెళ్ళి అక్కడ తినటానికి ఏమైనా దొరుకును అని భావించి ఆలయములోనికి వెళ్ళి శివలింగము దర్శించి అక్కడ తిండి కోసం గాలించడం అర్చకుడు గాంచి, "కుక్కను కొట్టండి" అని కేకలు వైచి వెంటపడగా, దిక్కు తోచక శివాలయం చుట్టూ పరుగులిడుతూ ప్రదక్షణ కావించె. జనం తాకిడికి బయటకు పోలేక ఉన్న ఆ కుక్కను బలంగా కొట్టడముతో శివాలయద్వారం వద్దనే పడి ప్రాణం విడిచె. తెలియక చేసిన లంకణం, జాగరణం, ప్రదక్షిణం, శివ దర్శనం, శివ సన్నిధానంన ప్రాణార్పణం వీటి అన్నింటి పుణ్యాన ఈ జన్మమున బుద్ధి-జ్ఞానం, రాజ్యం-రాజరికం దక్కినా కుక్క బుద్ధి మాత్రం ఇంకనూ పోలేదని చెప్పె.

కుముద్వతి అతని జన్మ రహస్యం విని ఆశ్చర్యపడి శివానుగ్రహంతో సర్వజ్ఞుడైన భర్త పాదాలకు ప్రణమిల్లి, ఆమె యొక్క పూర్వ జన్మ వివరం తెలుపమని ప్రార్థించె. రాజు ఆనందంగా ఆమె వృత్తాంతం ఇటుల తెలిపె. పూర్వ జన్మమున శ్రీశైలంలో ఆమె ఒక పావురమై మాంసం ముక్కను నోట కరుచుకుని ఎగిరి పోతుండగా, ఒక డేగ ఆ మాంసం ముక్కకై పావురాన్ని పొడుస్తూ, తరమగా ప్రాణభీతితో పావురం శ్రీశైల ఆలయ గోపురం చుట్టూ ప్రదక్షిణగా తిరుగుతుండగా చివరకు ఆ డేగ, పావురాన్ని చంపి, మాంసం ముక్కను ఎత్తుకు పోయె.

తెలియక చేసిన శ్రీశైల గోపుర ప్రదక్షిణ, శ్రీశైల మల్లిఖార్జుని సన్నిధిన నిష్క్రమణ పుణ్యాన ఆమెకు రాణి జన్మ లభించెనని వివరించె.

ఇంకనూ వారిరువురూ 7 జన్మలు రాజు-రాణీలుగా ఉత్తమ జన్మలు పొంది, చివరన అగస్త్య మహాముని ఆశీర్వాదంతో జన్మరాహిత్యం పొందగలమని రాజు, రాణితో తమ వృత్తాంతమంతయు విశదపరిచి, ఇంతటికీ శ్రీశైల మల్లిఖార్జునిని అనుగ్రహమే కారణం అంటూ రాజు

విమర్శణుడు, రాణి కుముద్వతితో కలిసి శ్రీశైల యాత్ర చేసి వచ్చె.

ఇంత మహిమాన్వితమైన శ్రీశైల క్షేత్ర గొప్పదనం వివరించి శ్రీగురుడు తంతుకుని తిరిగి తమ తో పాటుగా గంధర్వనగరానికి చేర్చె. శివరాత్రి పర్వదినాన శ్రీగురుని దర్శనార్ధమై వచ్చిన పురజనులంతా తంతుకుని ద్వారా శ్రీశైల యాత్రను, శ్రీగురుని మహత్యమును విని తరించె. తంతుకుడు ఆ జన్మాంతం శ్రీగురునికి భక్తుడై సేవించి ముక్తిని వరించె.

శ్రీగురుని స్తుతించి కవితా శక్తిని పొందిన నరహరి శర్మ వలే మరి ఇద్దరు బ్రాహ్మణులు శ్రీగురుని అనుగ్రహం తో కవులై ముక్తులయ్యె.

నంది శర్మ అనే బ్రాహ్మణుడు తెల్ల కుష్టు వ్యాధితో బాధపడుతూ ఉపశమనం కోసం తులజాపుర భవానిదేవిని 3 సం||లు ఉపాసించె. తదుపరి 3 రోజులు ఉపవసించె. నాటి రాత్రి అతనికి కలలో జగన్మాత కనిపించి చన్దలాపరమేశ్వరిని సేవించమని చెప్పగా అతడు 7 మాసాలు పాటు ఒంటి పూట భోజనం చేస్తూ మనసార ఆ పరమేశ్వరిని పూజించె. అంతట ఒక నాటి రాత్రి దేవి స్వప్నదర్శనం ఇచ్చి, అతనిని గంధర్వ పురములో కొలువై ఉన్న శ్రీగురున్ని ఆశ్రయించమని చెప్పి అంతర్ధానమాయె. నందిశర్మ నిద్రలేచి, "అయ్యో! ఇంత కాలం నేను దీక్షతో తులజాపుర భవానిదేవిని, చన్దలా పరమేశ్వరిని సేవించినా నా బాధ తొలగి పోలేదే, చివరకు ఒక మానవమాత్రుని ఆశ్రయించాలా! ఇంతటి కఠిన తపమాచరించి, శారీరకంగా బలహీనుడనైన నేను ఇంక ఎటూ పోలేను. తల్లీ! నీవల్ల కాదంటే నీ పాదాల వద్దనే పడి మరణిస్తాను " అని బాధపడుతూ ప్రాయోపావేశం చేయ సంకల్పించె. దేవి మరలా అతనికి కలలో కనిపించి వెంటనే అక్కడ నుంచి వెళ్లి పొమ్మని ఆదేశించి, ఆ గుడి పూజారికి కూడా ఆ తల్లి దర్శనమిచ్చి నందిశర్మను అచటనుంచి పంపించమని ఆజ్ఞాపించె. ఇంక వేరే దిక్కు లేక నందిశర్మ దేవిని పూజించి, పారణ ముగించి, ఆ ఊరు విడిచె.

తపో భంగంనకు తల్లడిల్లి, విలపిస్తూ, ఉపవశిస్తూ ఒక శివరాత్రి పర్వదినాన గాణ్గాపురం చేరుకుని, శ్రీగురుని కొరకై ఎదురు చూచె. సంగమం నుంచి వచ్చుచున్న గురువరుని గాంచి, నమస్కరించె. శ్రీగురుడు నందిశర్మను చూస్తూ "ఏమయ్యా! దేవి ఆదేశించినా, సంశయిస్తూ ఈ మానవమాత్రుని దర్శించుటెందులకు?" అని పలికె. శ్రీగురుని సర్వజ్ఞతకు నందిశర్మ పశ్చాత్తాపంతో ప్రణమిల్లి "స్వామీ! శుద్ధాత్ములైన మీ దర్శనంతో నాలో

తమోగుణం అంతరించి పాపం నశియించె. నాకు వివాహమైనప్పటికీ కుష్టు రోగ గ్రస్తుడనైన నన్ను నా భార్య, నా తల్లిదండ్రులు విడచినా, దిక్కు లేని వాడనై జగదాంబను ఆశ్రయించినా, కఠోరమైన పునశ్చరణ చేసినా నా రోగం నివారణ కాకుండె. చివరి ఆశతో మిమ్ము శరణు వేడితి, లేకున్న నాకు మరణమే గతి" అంటూ నందిశర్మ భగ్నహృదయుడై శ్రీగురుని దీనంగా అర్థించె.

ఆశ్రితజనరక్షకుడైన గురువరుడు అతని పట్ల కృప చెంది సోమనాధుడనే ప్రియ శిష్యునితో నందిశర్మను సంగమానికి పంపించి, సంకల్పం చెప్పించి, షట్కూల తీర్థంలో స్నానం చేయించి, అచట అశ్వత్థ ప్రదక్షిణ కావించి, కట్టుబట్టలు తగుల బెట్టించి, క్రొత్త వస్త్రాలు కట్టపెట్టించి, తీసుకుని రమ్మని ఆదేశించగా, శిష్యుడు ఆ ప్రకారమే చేయంగ, నందిశర్మ కుష్టు రోగం కరిగి కృశించి, శరీరం సువర్ణ వర్ణమున మెరుగుపడె. కానీ అతడు ఇంతకు ముందు శ్రీగురున్ని మానవమాత్రునిగా శంకించటం వలన అంతమేరకు అతని మోకాలిపై ఒక చోట కొద్దిగా కుష్టు మిగిలి ఉండె. అదిచూచి నందిశర్మ ఏడుస్తూ, రోగం పూర్తిగా మాన్పించమని శ్రీగురున్ని ప్రార్థించగా, అపుడు శ్రీగురుడు కొంచెం భస్మం అతని నాలుక పై ఉంచి, తనను స్తుతించమని ఆదేశించె.

శ్రీగురుని చేతి విభూతి మహత్తు నిరక్షరాశ్యుడైన అతని నోట, అద్భుతమైన గురుస్తుతులను వెలువరించె. గురుదేవుడు ప్రసాదించిన జ్ఞానముతో భక్తి పారవశ్యమున మైమరచి నందిశర్మ చేసిన స్తోత్రానికి గురువరుడు ప్రేమతో అతనిని 'కవీశ్వరుడు' అంటూ సత్కరించె. ఆ కొద్దిపాటి కుష్టు కూడా మటుమాయమవగా నందిశర్మ శ్రీగురుని మహాత్యాన్ని కొనియాడుతూ, గురు సన్నిధిననుభవిస్తూ, శ్రీగురుకథను వ్రాసి, అంత్యమున గురు పాదాలలీనమాయె.

శ్రీగురు అనుగ్రహముతో అరుదైన కవితా శక్తిని పొంది, నందిశర్మ చేసిన గురుస్తుతులు ఎందరో భక్తులు ప్రీతితో ఆలపించసాగె. అక్కడ సమీపాన హిప్పరిగి అనే గ్రామంలో ఉన్న నరకేసరి అనే బ్రాహ్మణుడు శివునిపై భక్తితో ఆ ఊరి శివాలయంన కొలువైన కల్లేశ్వరుడిని స్తుతిస్తూ ప్రతీ రోజు పంచపద్యమణిమాలలు వ్రాసి శివుని సేవించు చుండె. నందిశర్మ చేసిన గురుస్తుతులను విని ఇతని కవిత్వం ఉత్తమంగా ఉన్నను అవన్నీ నరస్తుతులు

అంటూ తక్కువగా తలంచుచుండె.

ఒకనాడు హిప్పరిగి గ్రామంనుండి గురుభక్తులు వచ్చి, శ్రీగురుని తమ గ్రామమునకు ఆహ్వానించి, ఊరేగింపుగా, ఉత్సవం చేస్తూ తీసుకుని వెళ్ళి, శ్రీగురునికి మెండైన విందులిచ్చె. ఆనాడు బ్రాహ్మణులు కొందరు కవిరాజు నరకేసరి వద్దకు వెళ్ళి, శ్రీగురునిపై 4 పద్యాలు వ్రాసి ఇప్పించమని, శ్రీగురుడు కవితా ప్రియులని విన్నవించె. నరకేసరి కల్లేశ్వరునికి మాత్రమే అంకితమైన తన కవిత్వం, నరుని ఎటుల స్తుతియింతు నంటూ నిరాకరించె. ఆ రోజు పూజ చేస్తున్న కవిరాజుకు చిత్రంగా మధ్యలోనే కునుకు పట్టి, కలలోనే కల్లేశ్వరుని స్థానంన శ్రీగురుడు కూర్చుని ఉండి, నరులమైన మమ్ము పూజించుటెందులకని నవ్వుతూ అడిగె. నరకేసరి తుళ్లుతూ నిద్రమేల్కొని శ్రీగురుని కడకేగి తన తపం ఫలియించి దివి నుండి వచ్చిన పరమేశ్వరుడైన శ్రీగురుని స్తుతిస్తూ పద్యాలు వ్రాసి పూజలు చేసి, శిష్యునిగా తనను అనుగ్రహించమంటూ శ్రీగురుని వేడుకునె. భక్తజనవల్లభుడైన శ్రీగురుడు నరకేసరిని ఆశీర్వదించి, అభీష్టాలు నెరవేర్చె.

అప్పటి నుండి నరకేసరి నిరతము తన మనస్సున కొలువుతీరిన కల్లేశ్వరుని ప్రతిరూపమైన శ్రీగురునికి తన కవితలతో పద్యాల మణిమాలలు అల్లి శ్రీగురుని పాదాల చల్లి పరిమళించిన బ్రతుకు శ్రీగురుని చెంతను వెల్లివిరిసె.

ఇటుల శ్రీగురుని మహత్తు దినదినమూ ద్విగుణీకృత తేజమున వ్యాపించసాగె.

ఒక దీపావళి పండుగకు ముందుగా వచ్చెడి ధన త్రయోదశి నాట తమ ఇంట ఆతిథ్యం ఇచ్చుటకై గురుదేవుని ఆహ్వానించుటకు ఆ చుట్టు పట్ల 7 గ్రామాల పెద్దలు వచ్చి శ్రీగురునికి విన్నవించె. వారిలో ఎవరికి వారు శ్రీగురుడు తమ ఇంటికి తప్పక రావాలని శ్రీగురుని మనసున ప్రార్థించె. గంధర్వ పుర వాసులకు ఈ విషయం తెలిసి, పండుగ నాడు తమను విడచి ఎక్కడకూ పోరాదంటూ శ్రీగురునికి నమస్కరించి మనవి చేసె.

ఆనాటి ధనత్రయోదశి మంగళస్నాన సాయం సమయాన శ్రీగురుడు 7 రూపాలలో 7 గ్రామాలకూ వెళ్ళి ప్రసాదలారగించి, 8 వ రూపాన గంధర్వ పుర వాసుల నివేదనలు గైకొనె.

కార్తీక పూర్ణిమ త్రిపురోత్సవం నాడు స్వామికి దీప తోరణాలు



శ్రీశైల క్షేత్ర మహిమను అక్కడ మరణించిన కుక్క, పావురంనకు కలిగిన సద్గతిని తంతుకునకు వివరిస్తున్న శ్రీగురుడు.



నందిశర్మ, నరకేసరులను అనుగ్రహించి దీవిస్తున్న శ్రీగురుడు.



గురువాక్య పరిపాలన తో ఏపుగా పెరిగిన జొన్న పైరును కోసి వేసిన పర్వతేశుడు.



గంధర్వపురంలో గల పుణ్య తీర్థాలలో భక్తులను మునకలు వేయిస్తూ పాపనాశతీర్థ మహిమను రత్నాదేవికి వివరిస్తున్న శ్రీగురుడు.

శ్రీగురుని ఈ లీల తెలుసుకొని ఉప్పొంగి, త్రిమూర్త్యాత్మకుడు, అవతార పురుషుడు అయిన శ్రీగురునికి జయజయ ధ్వానాలతో మంగళ ఆరతులిచ్చె.

గంధర్వ పురమున పర్వతేశుడనే వ్యవసాయదారుడు శ్రీగురునికి భక్తుడై నిత్యం మఠమునకు పోయి గురుదర్శనం చేసుకుని పొలమునకు పోతుండె. అతడు గుత్తకై సాగుచేసుకున్న పొలం సంగమం నుండి మఠానికి వెళ్ళే దారిలో ఉండటాన శ్రీగురుడు అలా వెళ్ళేటపుడు, వచ్చేటపుడు కనిపెట్టుకుని, పనికట్టుకుని పరుగులు పెట్టి భక్తితో దండంబెట్టు చుండె.

ఇంత శ్రద్ధా భక్తికి సంతసించిన శ్రీగురుడు కోరికేమిటంటూ ఆతని పలుకరించె. ఇంత కాలమునకు కలిగిన గురుకటాక్షభాగ్యమునకు అమితానందుడై పర్వతేశుడు "స్వామినే సాగు చేయు జొన్నచేను మీ దయ వలన విరివిగా పెరిగి ధాన్యం పింజారించె. మరి 2 మాసాలలో కోతకు తయారు కానున్న పైరును తమరు ఒక మారు కరుణావీక్షణమున ఆశీర్వదించిన మాకింక కొరత లేదని" శ్రీగురుని ప్రార్థించె. అంతట శ్రీగురుడు అతని పొలం చేరి తమ పుణ్యపాదం మోపి ఏపుగా పెరిగిన పైరును కలియచూచి "మేము తిరిగి ఇటువైపు వచ్చేసరికి పైరు మొత్తం కోయించుము" అంటూ సంగమానికి కదిలె.

పర్వతేశుడు గురుమాట జవదాటక పాటించెదనంటూ పొలం ఆసామి నుంచి అనుమతిని గొని, ఇల్లాలు - పిల్లలు గోల చేసి గొల్లు-గొల్లున విలపించినా, పొరుగువారు పళ్లికిలించి గేలి చేసినా కూలీలతో చేరి చేను చకాచకా కోసి గురువరుని రాకకై ఎదురు కాచె. శ్రీగురుడు వచ్చి కొత వేసిన పైరును చూచి, "నెనేదో హాస్యముగా అన్న మాటను పట్టి పండని పంటను కోసి వ్యర్థం చేసిన నీకు ఇపుడు గతి ఏమి?" అంటూ ఆతని నమ్మకాన్ని పరీక్షించె.

పర్వతేశుడపుడు "గురువాక్యమే నాకు ప్రమాణము" అంటూ అదురు-బెదురు లేక పరమానందముగా పలికె. ఆతని ధైర్యమును చూచి లోలోన మెచ్చి శ్రీగురుడు "నీ విశ్వాసమే నీకు రక్ష" అంటూ మఠంనకు మరలె.

ఒక వారం రోజుల తదుపరి ఆరంభమైన చలి గాలి విపరీతమై చుట్టు ప్రక్కల చేలన్నీ నేల వాలి, అటుపైన కురిసిన అకాల వానలకు పైరులన్నీ మన్నులో కలిసె. కానీ నవ్విన నాప చేనులో రతనాలు విరిసిన రీతిన, గురువరుని అనుగ్రహబలంన పర్వతేశుని పొలంలో కోసి వేయబడిన ఒక్కో

మొక్క మొదళ్ళనుంచి పది, పన్నెండు పిలకలు వచ్చి ఏపుగా పెరిగిన పంట విరగ కాచె.

పర్వతేశుని దంపతులు ఉత్సాహంతో భూమి పూజలు చేసి తమ పాలిట పెన్నిధి అయిన గురుదేవుని పాద పద్మముల వ్రాలి సంతోషముప్పొంగి కన్నీటితో కడిగె. కోరిన వారి కొంగు బంగారు చేసి కొరికలీడేర్చు కొండంత గురుడు చిరునవ్వుతో '**అఖండశ్రీరస్తు**' అంటూ వారికి అభయమిచ్చె. అమితంగా పండిన జొన్న ధాన్యం రాశులు పోసి, పైరు పాడై అలమటిస్తున్న తోటి ఆసాములకు కొంత ధాన్యమిచ్చి గురుమహాత్మ్యంను కొనియాడుతూ పర్వతేశుడు మిగిలిన ధాన్య లక్ష్మిని తన ఇల్లు చేర్చుకునె.

నిశ్చల గురు భక్తి అభీష్టాలను ప్రసాదించగలదనుటకు పర్వతేశుడు ప్రతీకగా నిలిచె.

ఒకనాటి దీపావళి పండుగకు ముందు కృష్ణ చతుర్దశి నాడు శ్రీగురుడు గంధర్వపురవాసులను త్రిస్థలి యాత్ర చేసి వద్దాం రండి, అంటూ తోడ్కొని పోయె.

గంధర్వ పురమందు గల సంగమ ప్రాంతమే ప్రయాగ అంతటి మహాత్యము గలదని, ఇచ్చట షట్కూల తీర్థం, ప్రయాగను కూడ మించిన మంచి తీర్థం అని, ఈ భీమా-అమరజా సంగమం, గంగా-యమునా సంగమం కంటే ఎంతో పవిత్రమైనదని చెప్పి, ఇక్కడ గల 8 పుణ్య తీర్థాలను గూర్చి శ్రీగురుడు వివరించి,ఒక్కొక్క దాని లో మునకలు వేయించె.

1. అమరజా నదీ తీర్థంను వివరిస్తూ, పూర్వం దేవతలకు-రాక్షసులకు జరిగిన యుద్ధంలో జలంధరుడు అనే రాక్షసుడు దేవతలను సంహరించుచుండె. ఇంద్రుడు ప్రార్థించగా శివుడు రాక్షసులతో యుద్ధానికి తలపడి, యుద్ధంలో మృతి చెందిన దేవతలను బ్రతికించుటకు అమృత భాండం ప్రసాదించె. అది దేవతల పై చల్లి, వారిని సజీవులను చేయగా, మిగిలిన అమృతం భూమిపై పడి అమరజా అనే నది రూపంలో ప్రవహిస్తూ, సంజీవని, సర్వపాపహారిణి అయి, అపమృత్యుభయం పోగొట్టి, త్రివేణి సంగమంతో సమానమైనదని తెలిపె.
2. అశ్వత్థవృక్షం దగ్గర గల మనోరథ తీర్థం మనోరథాలను నెరవేర్చునని, కల్పతరువుతో సమానమైన అశ్వత్థాన్ని, సంగమేశ్వరుడైన సదా శివున్ని పూజించినచో నిశ్చయంగా కోరిన కోరికలు నెరవేరునని తెలిపె.

3. నాగేశ్వరమనే గ్రామంనుండి, ఇటుగా ప్రవహించిన మహాతీర్థం సాక్షాత్ వారణాసి తీర్థమని క్రింది ఇతిహాసమును చెప్పె. పూర్వము భరద్వాజస గోత్రీకుడు అయిన బ్రాహ్మణోత్తముడు ఈశ్వర భక్తితో ఈశ్వర సాక్షాత్కారమును పొంది విరాగి అయి, తిరుగుతూ ఉండగా, అతని సోదరులు పాండురంగుడు, ఈశ్వరుడు కాశీకి వెళ్తూ, తమ అన్న అయిన అతనిని కూడా పిలువగా, అతడు వారికి అక్కడనే విశ్వేశ్వర దర్శనం కలిగించి, ప్రకటమైన మణికర్ణికా కుండం లో స్నానం చేయించె. అందు చేత ఈ ప్రదేశం సాక్షాత్ కాశీకాగా, ఆ కుండమే వారణాసి తీర్థమని తెలిపె.
4. తదుపరి సర్వ పాపహారి అయిన పాపనాశ తీర్థంను గూర్చి చెప్తూ ఉండగానే పూర్వాశ్రమంలో తమ సోదరి అయిన రత్నాదేవి వచ్చి, శ్రీగురునికి నమస్కరించి, పూర్వ జన్మ పాప ఫలితంగా సంక్రమించిన కుష్టు వ్యాధికి ఆమె భయపడి, రక్షించమంటూ శ్రీగురుని పాదాల పడి ప్రార్థించె. ఆమెకు అభయమిచ్చి, శ్రీగురుడు పాపనాశ తీర్థంన చేసే ఒక్కొక్క స్నానానికి ఏడు జన్మల పాపాలు నశించగలవని ఆమెను ఈ తీర్థంలో స్నానం చేయించె. అందరూ అలా చూస్తూ ఉండగానే ఆమె కుష్టు రోగం మాయమవటంతో, ఆ క్షేత్ర మహాత్యం తెలిసి సేవిస్తూ, ఆమె అక్కడనే ఉండి పోయె.
5. అక్కడ కోటి తీర్థంను చూపించి, ఇక్కడ చేసిన స్నానానికి కోటి గోవుల దానమిచ్చిన ఫలం అని, చేసిన ప్రతి దానానికి కోటి రెట్లు ఫలితమని, దీని ప్రక్కనే గల
6. రుద్రపాద తీర్థంలో స్నానం చేసి, గయలో లాగానే కర్మ కార్యాలు చేసి రుద్రపాద స్వామిని పూజించినచో మంచిదని, కేశవ స్వామి దగ్గర లో
7. చక్ర తీర్థం చూపి, ఇచ్చట చేసిన స్నానం వలన జ్ఞానం కలుగుననీ,
8. కల్లేశ్వరుని వద్దనగల మన్మథ తీర్థం లో స్నానం చేసి శివుని పూజిస్తే అష్టైశ్వర్యాలు ప్రాప్తించగలవని తెలిపి, శ్రీగురుడు అందరినీ, అష్ట తీర్థాలలో పుణ్య స్నానాలు చేయించె.

ప్రయాగ-సంగమం, షట్కూల తీర్థం, భీమా అమరజా తీర్థం.

అష్టతీర్థాలు: 1. భీమా అమరజా తీర్థం, 2. మనోరథ తీర్థం, 3. మహాతీర్థం( వారణాసి తీర్థం ), 4. పాపనాశ తీర్థం, 5. కోటితీర్థం, 6. రుద్ర పాద తీర్థం, 7. చక్ర తీర్థం, 8. మన్మథ తీర్థం.

ఇటులుండగా అప్పటి కాలంలో వైఢూర్య నగరాన్ని పాలించే ఒక

యవన రాజు విజ్ఞుడు, శుద్ధాత్ముడై పూర్వ జన్మ సంస్కారంతో మతసామరస్యాన్ని కలిగి సర్వభూత సముడై ఉండ, ఒకప్పుడు అతనికి తొడ మీద వ్రణం లేచి ఎట్టి చికిత్సలకు లొంగక బాధించ సాగె.

చివరకు ఒక విప్రోత్తముని ప్రార్థించగా అతడు పాపనాశ తీర్థంనకు వెళ్ళి అక్కడ స్నానం, ధ్యానం, దానం చేయమని తెలిపె. అటుల కొద్ది కాలం చేయుచుండ, ఒక యతీశ్వరుడు కనిపించి, సాధు దర్శనమే అన్నింటి కంటే శ్రేష్ఠమైనదని తరుణోపాయం చెప్పి క్రింది కథాగానం తార్కాణంగా వినిపించె.

అవంతీపురంన ఒక బ్రాహ్మణుడు భార్యను, స్వధర్మాన్ని విడచి ఒక వేశ్యకు వశుడై తప్ప త్రాగి ఆ వేశ్య ఇంటనే పడి ఉండె. ఒక సంధ్య వేళ ఋషభ యోగి అటుగా వెళ్తుండగా చూసి, ఈ మాలిన్య బ్రాహ్మణుడు – ఆ వేశ్య, ఆయనను భక్తితో సేవించి భిక్ష ఇచ్చి నిద్ర పుచ్చె. మరునాటి ఉదయం ఆ యోగి వీరిని ఆశీర్వదించి వెళ్ళె. అంతమాత్రం సాధు-సత్పురుషుల సేవ – దర్శనం వలన ఆ బ్రాహ్మణునిలో పరివర్తన కలిగి సద్బుద్ధి అంకురించగా మరుసటి జన్మమందున వజ్ర బాహువు అనే రాజు యొక్క పట్టపు రాణి సుమతి దేవి గర్భంలో పడె. రాజు గారి రెండవ భార్య అసూయ చెంది, సుమతీ దేవికి విషం పెట్టె. దానితో రాణికి, పుట్టిన బిడ్డకు ఒళ్ళంతా పురుగులు పడి, పుండ్లు పుట్టె. ఎట్టి చికిత్సలకు తగ్గక పోగా దీనికి కారణం పూర్వ జన్మ పాపమని తలచి, రాజు వారిని అడవిలో విడిచి పెట్టె. అక్కడ దగ్గరలో పద్మాకరుడనే వైశ్య రాజును ఆమె శరణు వేడగా ఆమె గతం తెలిసి అతడు జాలి చెంది వారికి ఎన్నో చికిత్సలు చేయించిననూ రాకుమారుడు మరణించె. అదృష్ట వశమున ఋషభ యోగి అటుగా వచ్చి, ఆ తల్లి హృదయ విదారకమైన శోకం విని, ఆ యోగి కరుణార్ద్రహృదయుడై చని పోయిన రాకుమారుడు పూర్వజన్మలో తనకు సేవ చేసిన బ్రాహ్మణుడు అని తెలుసుకుని, కొంచం భస్మం మంత్రించి, రాకుమారుని శవం పైన, రాణి సుమతీ దేవిపైన చల్లె. రాకుమారుడు జీవితుడై, ఆ తల్లి-బిడ్డలు ఆరోగ్యవంతులై, ఆ యోగీశ్వరునికి నమస్కరించగా, వారి శరీరాలు వజ్ర సమాన మైనవని చెప్పి, పిల్లాడు భద్రాయువు అనే రాజుగా కీర్తికెక్కుతాడని ఆశీర్వదించెనని యతీశ్వరుడు చెప్పి, యవన రాజుని శ్రీగురుని దర్శనం చేయమని, గంధర్వ పురంనకు పంపె. యవన రాజు గంధర్వ పురంనకు చేరి సంగమానికి వెళ్ళె. శ్రీగురుని దర్శించి నమస్కరించగా, ఆతని వ్రణం మటుమాయంకాగా పూర్వ జన్మ స్మృతి కలిగి

తాను ముందటి జన్మలో శ్రీపాద స్వామికి సేవ చేసే రజకుడినని జ్ఞప్తికి వచ్చి యవన రాజు శ్రీగురుని పాదాల పై పడి ఇంక తనను వీడవద్దని ప్రార్థన చేసె.

గురువర ప్రసాదమైన తన రాజ్య సంపదలు శ్రీగురుని పాదధూళితో పవిత్రం చేయమని, వారికి కష్టం కలిగించే గోవధను నిషేదించెదనని, తన గృహంనకు వచ్చి, తన పరివారంను ఆశీర్వదించమని యవన రాజు శ్రీగురుడు పాదములు పట్టి బ్రతిమలాడె.

యవనరాజు ప్రార్థనను మన్నించి శ్రీగురుడు అతని రాజ్యంనకు వచ్చి ఆతిథ్యంను స్వీకరించి, ఆతని సంతతిని దీవించి యవనరాజు అభ్యర్థన మేరకు నిరంతర గురుస్మరణను ప్రసాదించి, రాజ్య భారం కొడుకులకు అప్పగించి, శ్రీశైలం వచ్చి తిరిగి తనను కలుసుకోమని ఆదేశించె.

తదుపరి శ్రీగురుడు తమ శిష్యులతో గోదావరీ యాత్ర చేసి, భీమా-అమరజా సంగమంనకు చేరె. అచట గంధర్వ పుర వాసుల పూజలందుకుని కొంత కాలం పిమ్మట ఈశ్వర నామ సంవత్సరం, బృహస్పతి సింహరాశిలో ఉండగా తాము అవతారం పరిసమాప్తి చేయదలంచి శ్రీశైల యాత్రకు బయలుదేరె. అది తెలిసిన గ్రామస్తులంతా మఠంనకు చేరి, "తల్లి వలె ఇన్నినాళ్ళు మమ్ము కాచిన మీరు ఇటుల విడిచి పోవుట ధర్మం కాదు" అంటూ కన్నీరు - మున్నీరుగా విలపించె.

శ్రీగురుడు కరుణారస దరహాసమోముతో తాము ఎక్కడికీ పోవుట లేదనీ, స్థూలదృష్టికి కనపడక పోయినా, సూక్ష్మ రూపంలో ఇక్కడనే నివసించెదమని అనునయిస్తూ, తమ ప్రతిరూపమైన పాదుకలను ప్రతిష్టించి, చింతలు తొలగించుటకు సాక్షాత్ కల్పవృక్షమంటి అశ్వత్థ మూలంన చింతామణి అను బడు విఘ్నేశ్వరుని స్థాపన చేసి, నిర్మల మనస్సుతో నిత్యం తమను స్మరించే వారికి ప్రసన్నులై శాశ్వతంగా ఈడనే కొలువుతీరి ఉండెదమని పురవాసులను ఊరడించె.

తమ శిష్యులలో కొందరు ఇంతకు పూర్వమే శ్రీగురుని ఆజ్ఞమేరకు తీర్థయాత్రులకు వెళ్ళగా, కొందరు గురుపాదుకలను పూజిస్తూ గంధర్వపురముననే ఉండిపోయె. మిగలిన శిష్యులలో సాయందేవుడు, సిద్ధయోగి, నందిశర్మ, నరహరిశర్మలను తీసుకుని, శ్రీగురుడు శ్రీశైల యాత్రకు పయనమయ్యె.

అంతకు ముందటే తీర్థయాత్రలకు వెళ్ళిన శిష్యులు, యవనరాజు

శ్రీగురుని ఆదేశానుసారం శ్రీశైలం చేరి శ్రీగురుని కోసమై నిరీక్షించ సాగె. బహుధాన్య నామ సం|| ఉత్తరాయణ పుణ్యకాలం, శిశిర ఋతువు, మాఘమాసం, కృష్ణ పక్షం, పాడ్యమి శుక్రవారం నాడు శ్రీగురుడు శ్రీశైలం లో పాతాళ గంగ వద్ద స్నానం చేసి, ఒక పూల నావను తయారు పరచమని శిష్యులను ఆజ్ఞాపించె.

ఆ శుభసమయంలో శ్రీగురుడు శిష్యులు సిద్ధం చేసిన పుష్పాసనం పై కూర్చుని, నది మధ్యకు సాగి పోతూ, చివరి మాటగా, నివ్వెరబోయి నిలబడి ఉన్న ఆ నలుగురితో ఇటుల పలికె "నాయనలారా మీకు సర్వశుభాలు కలుగుగాక ! మా నామ సంకీర్తనంతో మా కథను గానం చేసే వారింట నాల్గు పురుషార్థాలు, ముక్తి సిద్ధిస్తాయి. మేము ఇపుడు ఆనంద నిలయానికి వెళ్తున్నాం, అక్కడ మల్లిఖార్జునినితో ఐక్యం చెందుతాం. మీకు మా ప్రసాదంగా 4 తామర పూవులు నది లో కొట్టుకొస్తాయి. వాటిని మీరు ప్రాణప్రదంగా భద్రపరచుకొని, గంధర్వపురం తిరిగి వెళ్ళండి. మీరు దిగులు పడవలదు, మీకు నిత్యం మా దర్శనం లభిస్తుంది." అని కన్నీరు కార్చుతున్న వారిని ఓదార్చి తరలె. ఇంతలో అటుగా వెళ్తున్న బెస్తవారు ఆ తామర పూవులు వారికి అందజేసె. వారు నలుగురూ సాయందేవుడు, సిద్ధయోగి, నందిశర్మ, నరహరిశర్మలు ఆ పూవులు తీసుకుని, గంధర్వపురం చేరి, శ్రీగురుని పూజించి, కీర్తించి, తరించె.

వారిలో సిద్ధయోగీంద్రులు, శ్రీగురునికి గల 7 గురు ముఖ్య శిష్యులలో ఒకరై శ్రీగురు చరితము కూర్చి, సిద్ధసరస్వతి స్వామిగా పూజలందుకొనె.

శ్రీగురు చరితం పారాయణ వలన సుఖం, పవిత్రత, శాంతి కలిగి పాపాలు, రోగాలు నశించి, ఇహములో పురుషార్థాలు, పరములో ముక్తి కలుగ గలవని సిద్ధ యోగీంద్రులు శ్రీగురు చరితము యొక్క ప్రాముఖ్యతను తెలియపరిచె. అంతేకాదు, ముఖ్యంగా, శ్రద్ధగా సప్తాహ పారాయణ చేయటం వలన సాయంకాలం లేగ దూడలు వాటి తల్లి గోవుల కడకు పరుగులిడు విధమున ఎవరికి వారు, వారి - వారి గురువుల దరికి చేరి మోదమొంది సేద తీరి పరమపదంను పొందగలరని సిద్ధయోగి ఆశీర్వాదములిచ్చె.

## శుభమస్తు

## శ్రీగురవే నమః

# అవధూతోపాఖ్యానం

1. గురుబ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవోమహేశ్వరః
   గురుస్సాక్షాత్పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః
2. గురు మధ్యే స్థితం విశ్వం విశ్వమధ్యే స్థితోగురుః
   గురుర్విశ్వం నచాన్యోస్తి తస్మై శ్రీ గురవే నమః

ఆది పరమాత్మ ఒక్కడే ఆయననూ నేననేక మౌదును గాక! అన్న ఆయన సంకల్పాన్ని అనుసరించి, త్రిమూర్తుల రూపమున సృష్టి, స్థితి, లయలు చేస్తూ, పరబ్రహ్మతో చేరి గురు తత్వమైన ఈ విశ్వమంతా గురు రూపమేనని గురుగీత వ్యాఖ్యానిస్తుంది.

అనగా గురువే త్రిగుణాలుగా భాసిస్తూ, త్రిగుణాతీతమైన పరబ్రహ్మగా శోభిస్తూ, మనలను పరమోన్నతికి నడిపిస్తున్నారు. అట్టి గురువరునికి మనసారా నమస్సులు చేయుటవలన ఉత్తమ జ్ఞానం సిద్ధించుచున్నది.

విశ్వరూపుడైన సద్గురుని అనుగ్రహానికి పాత్రులైన గురు భక్తులకు విశ్వమంతా గురు రూపంగానే అనుభవమవుతుంది. గురు కృప లభించక మునుపు అడుగడుగునా ప్రతిబంధకంగా అగుపించిన ఈ జగత్తు గురువరుని అవ్యాజకరుణతో బ్రహ్మజ్ఞానం కలిగి ఈ జగమంతా గురు రూపమై మన అజ్ఞాన అంధకారంను ఛేదించే అఖండ వెలుగు అవుతుంది.

ఇట్టి అనుభవం శ్రీభరద్వాజ మాష్టర్ గారికి 1963 Feb 8th న వారి గురుదేవులైన శ్రీశ్రీశ్రీసాయినాథుడు 5 గం||ల పాటు తన విశ్వచైతన్యంలో బ్రహ్మానుభూతిని ప్రసాదించి దీవించారు. ఆ బ్రహ్మైక్యానుభవ ఉత్సవాన్ని ఇప్పటికీ మనమంతా ఎంతో ఉత్సాహంతో ఆ అనుభవం మనకే జరిగినటుల ఆ ఆనందంలో భాగాన్ని పంచుకుంటున్నాం. ఎందుకంటే మనమంతా కూడా ఆయన విశ్వరూపంలో బ్రతుకుతున్న అదృష్ట వంతులం కాబట్టి.

అందుకే సనాతన గురు దేవుడైన సదాశివుడు గురుగీత మాధుర్యంను వివరిస్తూ, పార్వతీదేవికి ఈ శ్లోకంను వినిపించె.

3. గురురేకో జగత్సర్వం బ్రహ్మ విష్ణు శివాత్మకం
   గురోః పరతరం నాస్తి తస్మాత్సం పూజ యేద్గురుం

4. నిర్గుణం నిర్మలం శాంతం జంగమం స్థిరమేవచ
వ్యాప్తం యేన జగత్సర్వం తస్మై శ్రీ గురవే నమః

పర బ్రహ్మ స్వరూపుడైన గురువరుడే బ్రహ్మ విష్ణు శివ రూపాలుగా జగమంతా ప్రకాశిస్తున్నాడు. గుణరహితమై నిర్మలమైన శాంతాకారంతో జగమంతటనూ వ్యాపించి ఉన్న గురువు కన్నా ఉత్తమమైనది జగత్తు నందు ఎక్కడా ఉండదు, ఇట్టి శ్రీగురుని ఆశ్రయించి, పూజించి, నిరంతరం స్మరించుటచే బ్రహ్మ జ్ఞానం లభించుచున్నది.

అందుకే శ్రీ సాయి నాథుడు "శ్రద్ధా-సబూరి వహించినచో ఈ ప్రకృతే ఆది గురువై బోధించగలదు" అన్నారు.

గురు తత్వాన్ని సిద్ధయోగీంద్రుడు ఒక పురాణ ఉపాఖ్యానంగా తెలియ పరిచాడు.

ఒక సర్వ సంగ పరిత్యాగి, సర్వసమర్థుడు అయిన ఒక అవధూత పరమానందంలో మునిగి ఉండుట చూసి, యయాతి పుత్రుడైన యదుమహారాజు, "ఈ నిర్జనారణ్యంలో కటిక నేలపై పడుకుని కూడా ఇంత ఆనందం అనుభవమగుట ఎటుల సాధ్యం" అంటూ అడుగగా, ఆ అవధూత తాను "ఈ ప్రకృతిలో 24 మంది గురువులనుండి జ్ఞానం గ్రహించి, ఆచరించి, మహోన్నతమైన ఆత్మజ్ఞానం పొందాను. అందువలననే మహదానందంలో మునకలు వేస్తున్నా" నని ఆ 24 మంది గురువులనుంచి తాను నేర్చుకున్నది వివరించాడు.

1) భూమి - నుంచి, తల్లిలా ప్రేమ, ఓర్పు వహించాలని.
2) వాయువు- లా సుఖదుఃఖాలలో సమభావంతో అనాసక్తంగా నివసించాలని.
3) ఆకాశము- నుండి త్రిగుణాలకు అందక స్వచ్ఛంగా ఉండాలని.
4) అగ్ని- చే గుణ భేదాలను దహించి, ఏక విభూతి అయిన విశ్వ విభూతి తత్వాన్ని గ్రహించాలని.
5) సూర్యుడు- వలన జీవుల గుణదోషాలకు కర్తృత్వం వహించక సముడై తన అనుగ్రహాన్ని సర్వులకూ పంచాలని.
6) పావురం- మమకార వ్యామోహాలు విడవాలని.
7) కొండచిలువ- రుచి- శుచిలతో నిమిత్తం లేక అంతశ్శుచి అనెడి ధ్యానం లో లీనమయి ఆయాచితమైన ఆహారం స్వీకరించాలని.

8) సముద్రం- సద్గుణాలు వీడక, దుర్గుణాలను కూడక,సుఖ-దుఃఖ పొంగుకుంగులను విడిచి,ధర్మమనే చెలియల కట్టను దాటరాదని.
9) మిడుత- మోహాగ్నిలో చిక్కక నిత్యం జ్ఞానాగ్నిలో తన అజ్ఞానం ఆహుతి చేసుకోవాలని.
10) ఏనుగు- సర్వ సంగ పరిత్యాగులకు స్త్రీ సాంగత్యం తగని పని అని.
11) చీమ- లౌకిక సంపదలు కాక జ్ఞాన ధనం నిరంతరం కూడ బెట్టాలని.
12) చేప- జిహ్వను జయించాలని.
13) పింగళ- ఈ జీవ శరీరమును పరమాత్మకే (చేరుటకొరకే) అర్పించాలని.
14) శరకారుడు- భ్రమను విడిచి, ఆత్మ నిష్ఠుడు కావాలని.
15) బాలుడు- యోగి మానావమానాలు విడవాలని.
16) చంద్రుడు- తపస్వి ప్రత్యుపకారం ఆశించక సర్వులకూ ఆహ్లాదమైన చల్లదనమనెడి భగవదనుగ్రహమును అందించాలని .
17) తేనెటీగ – జ్ఞాని జ్ఞానం గ్రహించి ఆహారం కూడబెట్టక చేతులే భిక్షాపాత్ర, కడుపే కంచంగా జీవించాలని.
18) లేడి- మాయామోహిత శబ్దములవైపుకు పరుగులిడకూడదని.
19) గ్రద్ధ- లౌకిక సంపదలు వదిలి శాంతి పొందాలని.
20) కన్య- యోగి గుప్తంగా సాధన చేసుకోవాలని.
21) సర్పము- ఏకాంతాన్ని ఆశ్రయించి యోగం అభ్యసించి, నిశ్చింతగా యోగ సిద్ధి పొంది స్వచ్ఛందంగా దేహాన్ని త్యజించాలని.
22) సాలెపురుగు- తనగూడు తాను అల్లుకుని, తానే మ్రింగునటుల, బ్రహ్మమయమైన ఈ జగత్తును తత్త్వజ్ఞానంతో తెలియలేనివారు పుట్టుచూ చచ్చుచూ జీవన్మరణ చక్రమున పడి తామే ఉపాధులను ఏర్పరుచుకొనుచున్నారని.
23) భ్రమరకీటకము – జీవన్మరణ చక్రమున పడి నిరంతర గురు స్మరణతో తాను గురురూపుడు కాగలడని.
24) జలం- తపో ధనమున్నా, ఎల్లప్పుడు వినమ్రుడై ఉండాలని.

వీరినుండి కావలసినంత జ్ఞానం పొంది సంతోషంతో తేలి యాడుచున్నానని అవధూత తెలిపె.

**-శుభమస్తు-**

# మా ఇతర ప్రచురణలు

| క్ర.సం | పుస్తకము పేరు | ధర |
|---|---|---|
| 1. | వార్తాలాపము | 250 |
| | **స్వామిని గురించిన పుస్తకములు** | |
| 2. | అవధూత లీల, తెలుగు | 40 |
| 3. | అవధూత లీల, తెలుగు బైండింగ్ | 80 |
| 4. | అవధూత లీల తమిళ్ | 60 |
| 5. | అవధూత లీల కన్నడ | 80 |
| 6. | అవధూత లీల ఇంగ్లిషు | 30 |
| 7. | అవధూత లీల హింది | 60 |
| 8. | శ్రీ వెంకయ్య స్వామి, హింది | 5 |
| 9. | స్వామి సన్నిధి | 15 |
| 10. | అవధూత బోధామృతము | 15 |
| 11. | చూచి నేర్చుకో | 15 |
| 12. | గురుస్తుతి | 10 |
| 13. | బాలల వెంకయ్యస్వామి | 35 |
| 14. | అవధూత లీల **CD** | 20 |
| 15. | శ్రీ వెంకయ్యస్వామి, **ENG** | 5 |
| 16. | స్వామి కృప తెలుగు | 5 |
| 17. | స్వామి కృప తమిళ్ చిన్నవి | 5 |
| 18. | పిలిచిన పలికే దైవం | 5 |
| 19. | వెన్నెల పూలు | 5 |
| 20. | మౌన బోధ | 5 |
| 21. | బోధ యజ్ఞాయ నమః | 5 |
| 22. | ధర్మ మూర్తి | 5 |
| 23. | దివ్య లీలలు | 5 |
| 24. | వాళ్ళు ఉండే దాన్ని బట్టి గదయ్యా మన ముండేది | 5 |
| 25. | స్మృతి రహిత ప్రసన్నాయ నమః | 5 |
| 26. | స్మృతి మాత్ర ప్రసన్నాయ నమః | 5 |
| 27. | స్వామి అనుగ్రహము | 5 |
| 28. | సర్వ సమర్థుడు | 5 |
| 29. | నమ్మలేని పచ్చి సత్యాలు | 5 |
| 30. | నమ్మిన వారికి సొమ్ము నమ్మని వారికి దుమ్ము | 5 |
| 31. | శ్రీ వెంకయ్య స్వామి పూజ | 5 |
| 32. | వెంకయ్య స్వామి ఆరతులు | 10 |
| 33. | భజన | 2 |
| 34. | అసాధ్యము-సుసాధ్యము | 5 |
| | **ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ గురించిన పుస్తకములు** | |
| 35. | శ్రీసాయి మాస్టర్ బోధామృతాము | 60 |
| 36. | అమృత వాక్కులు | 5 |
| 37. | మృత్యువుపై ఘన విజయము | 5 |

| క్ర.సం | పుస్తకము పేరు | ధర |
|---|---|---|
| 38. | శుద్ధ చైతన్య మూర్తి | 5 |
| 39. | శ్రీ భరద్వాజ భక్తుల అనుభవాలు | 5 |
| 40. | మన ధర్మము - కర్తవ్యము | 5 |
| 41. | మాస్టర్‌గారి సత్సంగము | 15 |
| | **సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహరాజ్ (గొలగమూడి) గురించిన పుస్తకములు** | |
| 42. | సార్ లేఖలు -1 | 15 |
| 43. | సార్ లేఖలు-2 | 25 |
| 44. | సార్ లేఖలు - 3 | 10 |
| 45. | సార్ సన్నిధి | 20 |
| 46. | పురుషప్రయత్నం-గురు అనుగ్రహం | 5 |
| 47. | పతి సేవే పరమాత్మ సేవ 1 | 5 |
| 48. | పతి సేవే పరమాత్మ సేవ 2 | 5 |
| 49. | శ్రద్ధ (SS 0) | 5 |
| 50. | విశ్వగురుచింతన (SS 1) | 5 |
| 51. | సాధన (SS 2) | 5 |
| 52. | శ్రమతో సేవ-సేవతో కైవల్యం | 5 |
| 53. | పరోపకారార్థ మిదం శరీరం | 5 |
| 54. | శ్రీ సుబ్బరామయ్య మహారాజు భక్తుల అనుభవాలు | 25 |
| | **మహనీయుల గురించి** | |
| 55. | ధునివాలా దాదా | 15 |
| 56. | సాయి కృప | 5 |
| 57. | దైవం మానుష రూపేణ (పెద్దది) | 60 |
| 58. | దైవం మానుష రూపేణ(దర్గా స్వామి) | 5 |
| 59. | యర్ర దర్గా స్వామి | 5 |
| 60. | రంగన్న బాబు | 10 |
| 61. | నల్ల మస్తాన్ బాబా | 5 |
| 62. | అవధూతేంద్ర స్వామి | 5 |
| 63. | నరోపా జీవిత చరిత్ర | 5 |
| 64. | పూండి స్వామి | 10 |
| 65. | నాంపల్లి బాబా (హైదరాబాద్) | 10 |
| 66. | మాయి అమ్మ (సేలం) | 5 |
| 67. | శివనేశన్ స్వామి (షిర్డి) | 10 |
| 68. | శివుని ఆజ్ఞ (శ్రీ వెంకటేశ్వర స్వామి) | 10 |
| 69. | కంచి పరమాచార్య 1 | 40 |
| 70. | కంచి పరమాచార్య 2 | 40 |
| 71. | సుధీంద్ర బాబు | 5 |
| 72. | నామ కోటి(ఓం నారాయణ, ఆది నారాయణ) | 20 |
| 73. | శ్రీరామ నామ కోటి | 15 |



యవనరాజును అనుగ్రహిస్తున్న శ్రీగురుడు.



భక్తులకు తన కరుణాకటాక్షవీక్షణం తో దీవెనలిస్తున్న దరహాసమనోహర గురుదత్తమూర్తి.



# -శ్రీ గురుభ్యోనమః-

నీరాజనం

బ్రహ్మ విష్ణు మహేశ్వర రూపునకు  ఆధ్యాంత రహితునకు
అమర స్వరూపునకు సుందరాకారునకు
సత్య శుభ మంగళం  నిత్య నిజ మంగళం
ఆనంద నీరాజనం.